
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

గుంటూరు జిల్లా వార్తలు

గురువారం 23 జనవరి 2025

వైసీపీ ఇన్‌చార్జిలు ఎక్కడ?

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో చెల్లాచెదురు
- ఇప్పటికే కనుమరుగైన పలువురు మాజీలు


6

జేఈఈ మెయిన్స్ ప్రారంభం



- 11 గ్రూపులతో బ్యాంకు సొమ్ము హాంఫట్

స్వాహాకు.. సహకారం



- నకిలీ డ్వాక్రా సంఘాలకు రుణాలు
- రూ.లక్షకు 20 శాతం అధికారులకు కమీషన్
- రూ.1.16 కోట్లను పంచేసుకున్న అక్రమార్కులు
- నాడు అధికారాన్ని వాడేసుకున్న స్థానిక వైసీపీ నేతలు
- పేరేచర్ల, నల్లపాడు జీడీసీసీబీ బ్రాంచ్‌లో వెలుగు చూసిన వైనం

గుంటూరు సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అధికారం ఉంది.. చెప్పినట్లు చేసే వారున్నారు.. ఇంకేం నకిలీ డ్వాక్రా సంఘాలు సృష్టించి రుణాలు మంజూరు చేయించి పంచేసుకున్నారు. అధికారులు కాసులకు కక్కుర్తి పడి బ్యాంకు సొమ్మును ధారాదత్తం చేసేశారు. వైసీపీ హయాంలో గుంటూరు కేంద్ర సహకార బ్యాంకులో చోటుచేసుకున్న వరుస కుంభకోణాలు ఒక్కోటి వెలుగు చూస్తున్నాయి. గుంటూరు రూరల్ మండలంలోని నల్లపాడు జీడీసీసీ బ్యాంకులో రూ.1.16 కోట్ల స్వాహా కేసులో కొత్త కోణం వెలుగులోకి వచ్చింది. లేని డ్వాక్రా సంఘాలను ఉన్నట్లుగా చూపించి బ్యాంకు సొమ్మును దర్జాగా మేసేశారని తేలింది. 2022-23లో 11 నకిలీ డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేసి పేరేచర్ల, నల్లపాడు బ్యాంకుల్లో రుణాలు పొందేందుకు స్థానిక వైసీపీ నేతలు పథకం రూపొందించారు. సీసీ ద్వారా ఈ మొత్తం వ్యవహారం నడిపినట్లు సమాచారం. పేరేచర్ల బ్రాంచ్‌లో ఒక గ్రూపునకు పెద్దమొత్తంలో, నల్లపాడు బ్రాంచ్‌లో 10 గ్రూపులకు రూ.10 లక్షలకు తగ్గకుండా రుణం తీసుకున్నారు. అప్పట్లో ప్రజా ప్రతినిధుల వద్ద కీలకంగా ఉన్న చోటా మోటా నాయకులు ఈ రుణాలు మంజూరు చేయించేందుకు జీడీసీసీ ప్రధాన కార్యాలయంలో కీలకమైన స్థానంలో ఉన్న వ్యక్తులతో సిఫార్సు చేయించి రుణాలు మంజూరు చేయించుకున్నారు. రెండు బ్రాంచ్‌ల పరిధిలోని 11 డ్వాక్రా సంఘాల పేరుతో మంజూరైన రూ.1.16 కోట్లను స్థానిక నేతలు వాటాలు వేసుకుని పంచేసుకున్నారని సమాచారం.

నకిలీలకు అధికారుల సహకారం..

నల్లపాడు జీడీసీసీబీ బ్రాంచ్‌లో వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగినన్ని అక్రమాలు బహుశా రాష్ట్రంలో ఎక్కడా జరిగి ఉండవు. ఇక్కడ పనిచేసిన బ్యాంకు అధికారులు కోరి నకిలీ డ్వాక్రా సంఘాల కు, నకిలీ వ్యాపారులకు మాత్రమే రుణాలు మంజూరు చేశారన్న ఆరోపణలున్నాయి. కోల్డ్ స్టోరేజ్‌లకు ఇష్టానుసారంగా రుణాలు మం జూరు చేసిన ఘనత ఈ బ్రాంచ్‌కే చెందుతుంది. నకిలీ డ్వాక్రా సంఘాలను ప్రోత్సహించి రుణాలు మంజూరు చేసినందుకు అధికారులు కూడా భారీగానే పుచ్చుకున్నారన్న ఆరో పణలు ఉన్నాయి. రూ.లక్షకు 20 శాతం చొప్పున కమీషన్ తీసుకున్నట్లు సమాచారం.

పట్టీపట్టనట్లుగా బ్యాంకు అధికారులు

నల్లపాడు జీడీసీసీబీ బ్రాంచ్‌లో నకిలీ డ్వాక్రా సంఘాల పేరుతో రూ.1.16 కోట్లు కొట్టేసిన వ్యవహారంలో ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు సీరి యస్‌గా ఉన్నారు. జిల్లా స్థాయి సమావేశంలో కూడా ఆయన ఈ విషయం లో అధికా రులను అప్రమత్తం చేశారు. ఇదే విషయంలో జిల్లా గ్రామీణా భివృద్ధి సంస్థ పీడీ విజయలక్ష్మి జీడీసీసీ బ్యాంకు కు ప్రత్యేకంగా లేఖ కూడా రాసి అప్రమత్తం చేశారు. అయితే డబ్బులు పోయిన బ్రాంచ్‌లోని అధికా రులు మాత్రం ఏమీ పట్టనట్లుగా నింపాదిగా ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసు కేసు పెట్టి పోయిన సొమ్ము రాబట్టుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తి నట్లు ఉండటం ఆరోపణలకు తావిస్తోంది.



చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు

అలైన్‌మెంట్ అలాగే..

- 167ఏ హైవేలో నరసరావుపేట బైపాస్ భూసేకరణ వివాదాస్పదం
- నరసరావుపేట బైపాస్ మినహా రహదారి నిర్మాణానికి సమాయత్తం
- బాపట్ల జిల్లా పేజ్-1లో వేగవంతంగా రహదారి నిర్మాణ పనులు
- రూ.1,064.24 కోట్లు మంజూరు..
- రెండో దశ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తి

- మార్చేందుకు అంగీకరించని అధికారులు
- మార్చాలని రైతులు పట్టు.. సీఎంకు వినతి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఓడరేవు - పొందుగల 167ఏ జాతీయ రహదారి బైపాస్ అలైన్‌మెంట్ మార్చండి.. నరసరావుపేట మున్సిపల్ పరిధిలో రోడ్డు వేస్తున్నారు.. దీనివల్ల ఫలితం ఉండదు.. అలైన్‌మెంట్ మార్చి పట్టణానికి దూరంగా వేయాలి.. అని రైతులు పట్టుబడుతున్నారు. అయితే కుదరదు.. పాత అలైన్‌మెంట్ ప్రకారమే రహదారి నిర్మాణం జరుగుతుంది.. అని నేషనల్ హైవే అధికారులు తేల్చి చెప్తున్నారు. నరసరావుపేట బైపాస్ మినహా మిగతా ప్రాంతాల్లో భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చింది. నరసరావుపేట బైపాస్ భూసేకరణ మొదటి నుంచి వివాదాస్పదంగానే ఉంది. అలైన్‌మెంట్ మార్చాలని బాధిత రైతులు సర్వే రాళ్లను తొలగించడం.. భూముల్లో మార్కింగ్ చేయకుండా అడ్డుకుంటూ వస్తున్నారు. అలైన్‌మెంట్ మార్చాలని ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును కలిసి కోరారు. నేషనల్ హైవే అధికారులు మాత్రం అలైన్‌మెంట్ మార్చేందుకు ససేమిరా అని తేల్చిచెబుతున్నారు. నరసరావుపేట బైపాస్ నిర్మాణానికి 279.16 ఎకరాల భూమి అవసరం. సర్వే చేసి రైతులకు నోటీసులు జారీ చేశారు. భూములు ఇచ్చేందుకు రైతులు అంగీకరించడంలేదు. నరసరావుపేట మండలం కేసానుపల్లిలో 85.39, జొన్నలగడ్డ 37.15, నరసరావుపేట 33.55, గుంటగార్లపాడు 39.85, రావిపాడు గ్రామ పరిధిలో 83.22 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఈ గ్రామాల పరిధిలో భూసేకరణ వివాదాస్పదంగా మారడంతో రెండో దశలో మిగతా ప్రాంతంలో భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

వేగంగా పనులు

మొదటి దశలో నిర్మిస్తున్న రహదారికి చిలకలూరిపేట కొత్త బైపాస్‌లోపు భూసేకరణ పూర్తి చేశారు. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. కొత్త బైపాస్ నుంచి అడ్డరోడ్డు వరకు నాలుగు వరుసల రహదారికి భూసేకరణ చేయాల్సి ఉంది. కావూరు నుంచి కనపర్రు వరకు భూసేకరణకు రైతులు అంగీకరించారు. కావూరులో 49.15, నాదెండ్ల మండలం గోవిందాపురంలో 43.76, గణపవరంలో 5.80, ఇర్లపాడు 14.66, కనపర్రులో 4.91 ఎకరాల భూ సేకరణ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. రొంపిచర్ల మండలం మాచవరం పరిధిలో 11.28 ఎకరాలు, విప్పర్లలో 24.58, నకరికల్లు మండలం రూపెనగుంట్లలో 43.23, చల్లగుండ్లలో 66.80 ఎకరాల సేకరణకు రైతులు సహకరించినట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే ఈ ప్రాంతంలో భూమిని కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు ఎన్‌హెచ్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

రహదారి నిర్మాణం ఇలా..

బాపట్ల జిల్లా ఓడరేవు నుంచి పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డరోడ్డు వరకు రెండు వరసల రహదారిని (మిగతా 6వ పేజీలో)

నేటి నుంచి యార్డులో రైతులకు ఉచిత భోజనం

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో గురువారం నుంచి రైతులకు ఉచిత మధ్యాహ్న భోజన కార్యక్రమం ప్రారంభం కానుంది. ఇందుకోసం యార్డులోని భోజన శాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజాప్రతినిధులు అందుబాటులో లేని కారణంగా ఉదయం 11.30 గంటలకు మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, మిర్చియార్డు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని సెక్రటరి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. రోజుకు ఎంతమంది రైతులు వచ్చినా కడుపు నిండుగా భోజనం పెడతామని చెప్పారు. అలానే సోమవారం నుంచి ఉదయం అల్పాహారం కార్యక్రమం కూడా ప్రారంభమౌతుందన్నారు.



ఏఎన్‌యూ, థాయిలాండ్ మధ్య ఎంవోయూ



వర్సిటీ వీసీ ఆచార్య గంగాధరరావుని కలిసిన థాయిలాండ్ యూనివర్సిటీ ప్రతినిధులు

పెదకాకాని, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, థాయిలాండ్‌లోని మేజో యూనివర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని బోటనీ, మైక్రోబయాలజీ విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున తెలిపారు. థాయిలాండ్‌లోని మేజో యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ రెన్యువబుల్ ఎనర్జీ విభాగం, ఏఎన్యూ మైక్రో బయాలజీ విభాగం పరస్పర సహకారాన్ని అందించుకుంటాయని పేర్కొన్నారు. అధ్యాపకుల మార్పిడి, బోధన, పరిశోధన, ఇతర పునరుత్పాదక శక్తి వనరుల సాంకేతిక వినిమయం, ఆసియా ఖండంలో ప్రజల మధ్య శాంతి కొరకు కలిసి పని చేయాలని ఈ అవగాహన ఒప్పందంలో నిర్ణయం తీసుకున్నట్లు మల్లికార్జున వివరించారు. ఈ సందర్భంగా మేజో యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ రమేష్ ప్రభు, ప్రొఫెసర్ యువ లే విశ్వవిద్యాలయంలోని వృక్ష జీవశాస్త్ర విభాగాన్ని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. వీసీ ఆచార్య కె.గంగాధరరావు సమక్షంలో ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్, ఆచార్య జి.సింహాచలం, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.వీరయ్య, ఆచార్య అమృతవల్లి, డాక్టర్ మాధవి, ఆచార్య ఖాసిం, డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ కె.బాబు, డాక్టర్ కె.నాగరాజు, డాక్టర్ కె.విజయ్, డాక్టర్ మిథున్, డాక్టర్ బాలరాజు పాల్గొన్నారు.

సాగర్ సమాచారం

విజయపురిసౌత్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం బుధవారం నాటికి 558.10 అడుగులు ఉంది. ఇది 227.97 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9567 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7353, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 25,402 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 45,002 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

వైసీపీ ఇన్‌చార్జిలు ఎక్కడ?

- ఉమ్మడి గుంటూరు జిల్లాలో చెల్లాచెదురు
- ఇప్పటికే కనుమరుగైన పలువురు మాజీలు
- నాథుడులేని నావగా పొన్నూరు.. గుంటూరు పశ్చిమ
- మర్రి మౌనంతో చిలకలూరిపేటలో రజిని ఎదురీత
- సత్తెనపల్లిలో వైసీపీని వీడేందుకు 'చిట్టా' సిద్ధం
- నియోజకవర్గంలో అడుగుపెట్టలేని స్థితిలో పిన్నెల్లి

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి అప్పుడే ఎన్నికలు వస్తున్నట్లు భావించుకుని తిరిగి అధికారం ఖాయమనే ఊహల్లో విహరిస్తుండగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు మాత్రం భవిష్యత్‌పై ఆశలు వదిలేసుకుని కాడి కింద పడేశారు. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు ఒక్క నియోజకవర్గంలో కూడా గెలుపొందని విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో కొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలే లేని దుస్థితిలో ఆ పార్టీ ఉంది. మరికొన్ని నియోజకవర్గాలకు ఇన్‌చార్జిలు ఉండీ లేనట్లుగా వ్యవహరిస్తున్నారు. అధికారం అండగా విర్రవీగిన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే నియోజకవర్గం వదిలిపెట్టి పక్క రాష్ట్రంలో తలదాచుకోవాల్సిన హీనస్థితికి వెళ్ళారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఆయన నియోజకవర్గంలో అడుగుపెట్టకపోవడంతో దిక్కుతోచని స్థితిలో అక్కడ వైసీపీ కేడర్ ఉంది. ఇక వైసీపీ హయాంలో వినుకొండ ఎమ్మెల్యేగా నోటికొచ్చినట్టు విపక్షీయులపైనే కాకుండా స్వపక్షీయులపై కూడా నోటికొచ్చినట్టు మాట్లాడుతూ బూతుల బ్రహ్మయ్యగా పేరొందిన బొల్లా బ్రహ్మనాయుడు ప్రస్తుతం నోరుమెదపకుండా ఉంటూ అసలు ఆ నియోజకవర్గానికి ఆయనేనా ఇన్‌చార్జి అనే అనుమానాలు కలగ చేస్తున్నారు. ఇక వైసీపీలో మంత్రిగా ఓ వెలుగు వెలిగిన విడదల రజిని తిరిగి చిలకలూరిపేటలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు భయం భయంగా అడుగుపెట్టారు. అయితే ఆమెకు ఇన్‌చార్జి పదవిని తిరిగి ఇవ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పార్టీని వీడే ఉద్దేశంతో మౌనంగా ఉండటంతో ఆమె అక్కడ ఎదురీత ఈదాల్సి వస్తున్నది. రేపల్లె నియోజకవర్గంలో వైసీపీ పరిస్థితి దయనీయంగా ఉంది. ఆ నియోజకవర్గంలో కొంత పట్టున్న మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణ ఆ పార్టీని వీడి టీడీపీలో చేరటంతో దాదాపు వైసీపీ కేడర్ అంతా ఆయన వెంటే వెళ్లిపోయింది. ఇక గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన ఈపూరు గణేష్ పూర్తిగా కాడి కిందపడేసి వైద్య వృత్తికే తిరిగి అంకితమైపోయారు. అలాగే తెనాలి ఇన్‌చార్జిగా మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఉన్నా ఆయన ఇంటికే పరిమితమైపోయారు. ఎస్సీ నియోజకవర్గాలైన తాడికొండ, ప్రత్తిపాడు, వేమూరు నియోజకవర్గాల పరిస్థితి కూడా దయనీయంగానే ఉంది. తాడికొండ నుంచి పోటీ చేసి ఓడిన మాజీ మంత్రి మేకతోటి సుచరిత ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి ఏకంగా రాజకీయాల నుంచే తప్పుకున్న విషయం తెలిసిందే. ప్రత్యామ్నాయం ఎవరూ దొరక్క గుంటూరు నగరం నుంచి డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబును వలస తీసుకెళ్ళారు. అయితే ఆయన ఒంటెద్దు పోకడల మూలంగా అప్పుడే స్థానిక కేడర్‌లో వ్యతిరేకత మొదలైంది. ప్రత్తిపాడు నుంచి పోటీ చేసి ఓడిన వలస నేత బలసాని కిరణ్‌కుమార్ తిరిగి బెజవాడకు వెళ్లిపోయారు. వేమూరు ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కొంత మేరకు నియోజకవర్గానికి అందుబాటులో ఉన్నా మాజీ మంత్రి మేరుగ నాగార్జునతో ఉన్న విభేదాల మూలంగా అక్కడి పార్టీ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉంది. ఇక గుంటూరు పశ్చిమ, పొన్నూరు నియోజకవర్గాలకు ఇన్‌చార్జి లేని పరిస్థితి. గుంటూరు పశ్చిమ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిన మాజీ మంత్రి రజిని చిలకలూరిపేటకు వెళ్లడంతో ఇక్కడ ఎవరినీ నియమించలేదు. టీడీపీకి కంచుకోటగా ఉన్న ఈ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకునేందుకు ఎవరూ సాహసించే పరిస్థితి కూడా లేదు. గత ఎన్నికల్లో గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి రోశయ్య ఏకంగా పార్టీయే ఫిరాయించటంతో పార్లమెంటు నియోజకవర్గానికి కూడా ఇన్‌చార్జి లేని పరిస్థితి నెలకొన్నది. పొన్నూరు నుంచి పోటీ చేసి పరాజయంపాలైన అంబటి మురళీకృష్ణ గ్రీన్ గ్రేస్ అపార్ట్‌మెంట్ వివాదంలో చిక్కుకుని తిరిగి పొన్నూరులో అడుగుపెట్టలేని స్థితిలో ఉన్నారు. సత్తెనపల్లి ఇన్‌చార్జిగా కొద్ది రోజులుగా డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డిని నియమించారు. అయితే ఆయన నియామకాన్ని వ్యతిరేకిస్తున్న గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. ఏమాత్రం ప్రజాబలం లేని వ్యక్తులకు బాధ్యతలు అప్పగించటం ఏంటంటూ అలక వహించిన ఆయన వైసీపీని వీడేందుకు సిద్ధంగా ఉన్నారు. గుంటూరు తూర్పు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న షేక్ నూరిఫాతిమా కూడా అస్త్ర సన్యాసం చేశారు. గురజాల ఇన్‌చార్జి కాసు మహేష్‌రెడ్డి పార్టీ కార్యక్రమాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. నరసరావుపేట ఇన్‌చార్జి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చురుగ్గా వ్యవహరించడం లేదు. మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి యువనేత నారా లోకేశ్ చేతిలో ఘోర ఓటమిని చవిచూసిన మురుగుడు లావణ్య ఆ షాక్ నుంచి ఇంకా కోలుకోలేదు. పెదకూరపాడు ఇన్‌చార్జి నంబూరు శంకరరావు పార్టీ శ్రేణులకు దూరంగా ఉంటూ వ్యాపారంలో మునిగిపోయారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు
- టీడీపీలో చేరిన నలుగురు కౌన్సిలర్లు



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా పని చేయాలనీ, అందుకే అందరిని కలుపుకొని ముందుకు వెళ్తున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో వైసీపీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు నూతనంగా జీవీ ఆంజనేయులు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన 11వ వార్డు కౌన్సిలర్ క్లిస్టం నీలిమ, 20వ వార్డు కౌన్సిలర్ నంది అంజలి, 21వ వార్డు కౌన్సిలర్ గర్రె శ్రీనివాసరావు, 4వ వార్డు కౌన్సిలర్ ఇందుమతికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో వినుకొండ మున్సిపాల్టీ పరిధిలో మొత్తం 32 కౌన్సిలర్లు ఉండగా వైసీపీ నుంచి గెలుపొందిన 28 కౌన్సిలర్లకుగానూ గత ఎన్నికల సమయంలో గంధం కృష్ణవేణి, మార్కెట్ నన్నేసా టీడీపీలో చేరగా, నూతనంగా మరో నలుగురు చేరడం అభినందనీయం అన్నారు. వైసీపీ హయాంలో వార్డులో అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడడంతో అభివృద్ధే లక్ష్యంగా వారు వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. అభివృద్ధికి సహకరించే వారందరికీ అండగా ఉంటామని చెప్పారు. గత ఎన్నికల్లో కనివిని ఎరుగని రీతిలో 30 వేల ఆధిక్యంతో గెలిపించారనీ, వినుకొండ పట్టణంలో మరింత ఆదరించారని వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామన్నారు. భావితరాలు గుర్తుపెట్టుకునేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. త్వరలో రామలింగేశ్వర స్వామి ఆలయం, ఘాట్ రోడ్డు నిర్మాణాలు పూర్తి చేస్తాం అన్నారు. ఇంటింటికీ మంచినీరు అందిస్తామని చెప్పారు. శాశ్వత మంచినీటి పథకంతోపాటు స్టేడియం, షాదిఖానా, పార్కు, టీటీడీ కల్యాణ మండపం పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం టీడీపీలో చేరిన కౌన్సిలర్లు క్లిస్టం నీలిమ, నంది అంజలి, గర్రె శ్రీనివాసరావు, ఇందుమతితోపాటు నంది కొండలు, క్లిస్టం బ్రహ్మయ్య, గర్రె నరసింహరావు, పులిపాటి రామారావు, 2వ సచివాలయం మహిళా కన్వీనర్ లక్ష్మీ సామ్రాజ్యం, వైసీపీ బూత్ కన్వీనర్ గోళ్ళ రాజును పార్టీలోకి ఆహ్వానించి అభినందించారు.

నేడు మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

- ఉదయం ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్
- సాయంత్రం లైవ్ మ్యూజికల్ షో
- మెగా రక్తదాన శిబిరం, అన్నదానాలు

మంగళగిరి సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి, మంగళగిరి శాసనసభ్యుడు నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పలు కార్యక్రమాలు జరుగనున్నాయి. నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఉదయం 8:30 గంటలకు గౌతమబుద్ధ రోడ్డు వెంబడి మయూరీ టెక్ పార్కు ఎదురుగా మెగా రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ ప్రారంభిస్తారు. 9:30 గంటలకు నవులూరు స్టేడియంలో ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌ను ఎంపీ సానా సతీశ్ ప్రారంభిస్తారు. 11:30 గంటలకు విజేతలకు బహుమతులను ప్రదానం చేయనున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి మంగళగిరి బైపాస్ మయూరి టెక్ పార్కు ఎదురుగా ఉన్న మైదానంలో పెద్ద ఎత్తున లైవ్ మ్యూజిక్ షో జరుగనుంది. షేక్ రియాజ్ ఆధ్వర్యంలో చినకాకాని షైన్ ఆశ్రమంలో అన్నదానం, గౌరీ శంకర్ ఆధ్వర్యంలో గాలిగోపురం వద్ద అల్పాహారం, జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో నృసింహాలయంలో ప్రత్యేక పూజలు, టీడీపీ పట్టణ, రూరల్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెస్సెస్ భవన్‌లో కేక్ కటింగ్, ఎల్ఎస్ గోల్డ్ స్మిత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం, ఆటోనగర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్, జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ, సోలార్ డాట్ ఇన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు వెయ్యి థర్మల్ వాటర్ బాటిళ్ల పంపిణీ, జగ్గారపు రాము ఆధ్వర్యంలో పాతమంగళగిరి పాఠశాలకు ఆర్వో ప్లాంటు బహూకరణ, జొన్నాదుల బాలకృష్ణ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ, కొత్తపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదానం, తోపుడు బండ్లు, ట్రైసైకిల్స్ పంపిణీ, షేక్ సుభాని, రాయపూడి కిరణ్, కంభం సాయి, గోసాల రాఘవ ఆధ్వర్యంలో వేర్వేరుగా అన్నదాన కార్యక్రమాలు జరుగనున్నాయి. నేషనల్ యాక్టివ్ రిపోర్టర్స్ అసోసియేషన్, ఎల్లో సింగం ఆధ్వర్యంలో ఆత్మకూరులోని పీజీఎం చిల్డ్రన్ హోంలో బాలలకు అన్నదానం చేయనున్నారు.

అలైన్‌మెంట్ అలాగే...

(5వ పేజీ తరువాయి)



చిలకలూరిపేట మండలం బొప్పూడి ప్రాంతంలో జాతీయ రహదారి నిర్మాణ పనులు

నాలుగు వరసలుగా విస్తరిస్తున్నారు. రెండు ప్యాకేజీలు రూ.1,064 కోట్లతో రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్) పనులు నిర్వహిస్తోంది. ఓడరేవు బీచ్ నుంచి రహదారి నిర్మాణం ప్రారంభమవుతోంది. 45 మీటర్ల వెడల్పున భూమిని సేకరిస్తారు. గత ఫిబ్రవరిలో మొదటి ప్యాకేజీలో పనులు ప్రారంభమయ్యాయి. ఓడరేవు, చీరాల, కారంచేడు, పర్చూరు, తిమ్మరాజుపాలెం, చిలకలూరిపేట, గంగన్నపాలెం, నరసరావుపేటలో బైపాస్‌లు నిర్మిస్తారు. 85 కిలోమీటర్ల రహదారి నిర్మాణంలో 46 కిలోమీటర్లు బైపాస్‌ల నిర్మాణం ఉంటుంది. ప్యాకేజి ఒకటిలో ఓడరేవు నుంచి చిలకలూరిపేట వరకు 47 కిలోమీటర్లు.. ప్యాకేజ్ రెండులో చిలకలూరిపేట నుంచి అద్దరోడ్డు వరకు 38 కిలోమీటర్లు. కారంచేడు-పర్చూరు మధ్య ఉప్పుటూరు వద్ద ఒక టోల్ ప్లాజా, చిలకలూరిపేట మండలం కావూరు దగ్గర మరో టోల్ ప్లాజా ఏర్పాటు చేస్తారు. తొమ్మిది ఫ్లైఓవర్లు, రెండు ఆర్‌వోబీలు.. ఆరు మేజర్ బ్రిడ్జిలు, రెండు ఇంటర్ ఛేంజింగ్‌లు నిర్మిస్తారు. 167ఏ జాతీయ రహదారి చీరాల, చిలకలూరిపేట ప్రాంతాల్లో రెండు జాతీయ రహదారులను కలుపుతారు. వాకావారిపాలెం దగ్గర చీరాల కారంచేడుకు బైపాస్ 14.3 కిలోమీటర్ల పొడవున నిర్మిస్తారు. పర్చూరు-గుంటూరు రోడ్డు క్రాసింగ్ దగ్గర మరో ఫ్లైఓవర్ నిర్మిస్తారు. చిలకలూరిపేట రోడ్డులో కలుస్తుంది. చిలకలూరిపేటకు మరో బైపాస్ వస్తోంది. పసుమర్రు దగ్గరలో దీనిని నిర్మిస్తారు. బొప్పూడి దగ్గర కొత్త బైపాస్‌లో కలుస్తుంది.

టెండర్ నిర్వహణలో జాప్యం..

ప్యాకేజ్ రెండులో రహదారి నిర్మాణానికి టెండర్లు నిర్వహించారు. రెండో ప్యాకేజీలో భూసేకరణ జాప్యం కారణంగా టెండర్ నిర్వహణలో జాప్యం జరిగింది. కొత్త బైపాస్ నుంచి ప్యాకేజ్ రెండు ప్రారంభమవుతుంది. పాత రహదారిని విస్తరిస్తారు. గంగన్నపాలెంలో బైపాస్ వస్తుంది.

ఈశ్వర్ కళాశాల దగ్గర కుడి వైపునకు నరసరావుపేట బైపాస్ ప్రారంభమవుతుంది. 14.4 కిలోమీటర్ల బైపాస్ నిర్మిస్తారు. ఢిల్లీ పబ్లిక్ స్కూల్ పక్క నుంచి కుప్పగంజి వాగు మీదగా టిడ్కో ఇళ్ల సమీపంలో రైల్వే లైన్ క్రాస్ చేస్తారు. ఇక్కడ ఆర్‌వోబీని నిర్మిస్తారు. నరసరావుపేట-గుంటూరు రోడ్డు క్రాస్ చేస్తోంది. ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మిస్తారు. ఇస్సపాలెం దగ్గర సత్తెనపల్లి రోడ్డు క్రాస్ చేస్తోంది. ఇక్కడ ఫ్లైఓవర్‌ను నిర్మిస్తారు. రావిపాడు తర్వాత ఉన్న రహదారిలో ఇది కలుస్తుంది. అక్కడ నుంచి ఉన్న రహదారిని విస్తరిస్తారు. అద్దరోడ్డు దగ్గర బైపాస్ నిర్మిస్తారు. ఈ గ్రామం వద్ద ఇంటర్ ఛేంజ్ నిర్మించి అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిలో కలుపుతారు.

హోరాహోరీగా భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు (విద్య) జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోరంట్లలో భాష్యం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు కొనసాగుతున్నాయి. బుధవారం జరిగిన పోటీలను సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ పరిశీలించారు. క్రికెట్ పోటీలు మూడో రోజు హోరాహోరీగా సాగాయి. ఉదయం ప్రిలిమినరీ మ్యాచ్లో గుంటూరు గ్లాడియేటర్స్-1 జట్టు, హైదరాబాద్ హరికేన్స్-1 జట్టుతో తలపడగా గుంటూరు గ్లాడియేటర్స్-1 జట్టు విజయం సాధించింది. మధ్యాహ్నం క్వార్టర్స్ ఫైనల్స్ మ్యాచ్లో వెస్ట్ గోదావరి వారియర్స్‌తో గుంటూరు గార్డియెన్స్-2 జట్టు తలపడగా వెస్ట్ గోదావరి వారియర్స్ జట్టు విజయం సాధించింది. పోటీల్లో గెలుపొందిన జట్టుకు చైర్మన్ భాష్యం రామకృష్ణ ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో భాష్యం విద్యాసంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు నుంచి గయాకు ప్రత్యేక రైలు

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కుంభమేళాకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం గుంటూరు నుంచి గయాకు ఒక ప్రత్యేక రైలును నడపనున్నట్లు డీఆర్ఎం ఎం.రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు 07719 గుంటూరు - గయా రైలు ఈ నెల 25న మధ్యాహ్నం 2.20కి బయలుదేరి వరంగల్ మీదుగా మరుసటి రోజు రాత్రి 8.30కి ప్రయాగ్‌రాజ్ చియోకి, సోమవారం ఉదయం 9 గంటలకు గయా చేరుకొంటుంది. మొత్తం 1939 కిలోమీటర్ల దూరం ఈ రైలు ప్రయాణిస్తుంది. తిరుగు ప్రయాణం నంబరు 07720 గయా - గుంటూరు ప్రత్యేక రైలు ఈ నెల 27వ తేదీన(సోమవారం) మధ్యాహ్నం 2.15కి బయలుదేరి రాత్రి 9.25కి ప్రయాగ్‌రాజ్ చియోకి, బుధవారం వేకువజామున 4 గంటలకు గుంటూరు చేరుకొంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు స్లీపర్, ఏసీ, జనరల్ బోగీలతో ప్రయాణిస్తాయని డీఆర్ఎం తెలిపారు.

జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్ష ప్రారంభం



నల్లపాడులోని పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల కోలాహలం

గుంటూరు (విద్య), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సాంకేతిక విద్యాసంస్థలైన నిట్, ఐఐటీల్లో ప్రవేశం కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ ప్రవేశ పరీక్ష బుధవారం ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో ఇందుకోసం మొత్తం ఏడు కేంద్రాలు ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాకు సంబంధించి నల్లపాడు, యూనివర్సల్ ఇంజనీరింగ్ కాలేజి, పేరేచర్ల, ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజి, పుల్లడిగుంట, పల్నాడులో నరసరావుపేట ఇంజనీరింగ్ కాలేజి, ఏఎం రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో కంప్యూటర్ ఆధారిత పరీక్షలు నిర్వహించారు. ప్రవేశ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 3 గంటల నుంచి 6 గంటల వరకు రెండు విడతల్లో నిర్వహించారు. ఆయా కేంద్రాలకు విద్యార్థులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. నిర్దేశించిన సమయం కంటే ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించమని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ముందుగానే స్పష్టం చేయడంతో విద్యార్థులు దాదాపు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. కేంద్రాల వద్ద పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు. విద్యార్థులను తనిఖీ చేసిన అనంతరం కేంద్రాల్లోకి అనుమతించారు. తొలిరోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.

రూ. 476 కోట్లు లక్ష్యంగా మార్కెట్ సెస్ వసూలు

- మార్కెటింగ్ శాఖ ఆర్జేడీ శ్రీనివాసరావు



వేమూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రీజియన్ పరిధిలోని 9 జిల్లాల్లో ఉన్న 90 వ్యవసాయ మార్కెట్ యార్డుల ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.476 కోట్లు మార్కెట్ సెస్ వసూలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని, డిసెంబరు నాటికి రూ.270 కోట్లు వసూలు చేశామని, మిగిలిన రూ. 206 కోట్లను మూడు నెలల్లోగా వసూలు చేస్తామని మార్కెటింగ్ శాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన వేమూరులోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు విచ్చేసి విలేకర్లతో మాట్లాడారు. ఏలూరు, వెస్ట్ గోదావరి, ఈస్ట్ గోదావరి, ఎన్టీఆర్ జిల్లా, పల్నాడు, కృష్ణ, గుంటూరు, బాపట్ల ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉన్న 90 యార్డులలో రైతుల సౌకర్యార్థం రసాయన ఎరువుల విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ కన్నా తక్కువ ధరకు ఎరువులు విక్రయించనున్నట్లు చెప్పారు. డీసీఎంఎస్‌లు ద్వారా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. యార్డుల అభివృద్ధికి ప్రభుత్వ ఆదేశాల మేరకు అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. ఎరువులతో పాటుగా విత్తనాల కొనుగోలు కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. జొన్న, మొక్కజొన్న, పసుపు కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. రైతుబంధు పథకం ద్వారా మార్కెట్ యార్డు గోదాములలో నిల్వ చేసిన ధాన్యానికి సరుకు విలువలో 75 శాతం గరిష్టంగా రూ. 2 లక్షల వరకు వడ్డీ లేని రుణాన్ని అందజేస్తాం అన్నారు. సౌకర్యాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. సమావేశంలో యార్డు కార్యదర్శి అంజిబాబు పాల్గొన్నారు.

నీటి తోడకంతో బయటకు కనిపిస్తున్న పునాదులు



నీరు తగ్గటంతో బయటకు కనిపిస్తున్న మూడో టవర్ పునాదులు

తుళ్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వాటర్ నుంచి గవర్నమెంట్ కాంప్లెక్స్ టవర్ల పునాదులు బయట పడుతున్నాయి. ఇప్పటికే ఒకటి, రెండు టవర్ల రాఫ్ట్ ఫౌండేషన్ నీటి నుంచి బయట పడిన సంగతి తెలిసిందే. భారీ మోటార్లతో నీటిని తోడేస్తున్నారు. నీటిని తొలగిస్తుండటంతో మరో మూడు టవర్ల పునాదులు బయట పడుతున్నాయి. నాలుగు రోజుల్లో నీరు మొత్తం పునాదుల నుంచి బయటకు వెళ్తుందని చెబుతున్నారు. ఈ నెల ఆఖరికి సీఆర్డీఏ ఈ టవర్ల నిర్మాణానికి టెండర్లు ఓపెన్ చేయనుంది. నీటిని తొలగించి వెంటనే ప్రభుత్వ కాంప్లెక్స్ టవర్ల నిర్మాణం పునఃప్రారంభం చేయనున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పునాదులు నీటిలో నాని ఉన్నా, నిర్మాణానికి ఢోకా లేదని ఐఐటీ మద్రాసు, ఐఐటీ హైదరాబాద్ సంస్థలు ధ్రువీకరించాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు


అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145,154,165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

87,523 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 90,138 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 87,523 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 59,487 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7200	15000	334	7200	14000
నెంబరు. 5	10000	10500	నెంబరు.5	10000	10000
273	9500	13500	273	--	--
341	8500	15000	341	8000	13500
4884	9000	14000	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	15500	తేజ	8000	15000
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	8000	12000
దేవనూరు డీలక్స్	8000	13500	దేవనూరు డీలక్స్	10000	11000
తెల్లకాయలు	4000	10000	తెల్లకాయలు	4000	8500


భావితరాల భవిష్యత్తుకు ఆశాజ్యోతి
యువనాయకుడు, అవిశ్రాంత పోరాట యోధుడు
రాష్ట్ర మంత్రివర్యులు
గౌ|| శ్రీ నారా లోకేష్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు...
మీ
కనపర్తి శ్రీనివాసరావు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి
మరియు అవనిగడ్డ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 23 జనవరి 2025

కౌన్సెలింగ్

వెంట్రుకలు పెరగడం లేదెందుకు?

డాక్టర్! నా వయసు 45. మునుపటిలా వెంట్రుకలు పెరగడంలేదు. పెరుగుదల వేగం తగ్గినట్టు స్పష్టంగా గమనించగలుగుతున్నాను. ఈ మార్పు ఎందుకు? మునుపటిలా వెంట్రుకలు వేగంగా పెరిగే మార్గం లేదా?

- ఓ సోదరి, హైదరాబాద్

కోవిడ్, డెంగు, మలేరియా లాంటి రుగ్మతల బారిన పడినప్పుడు వెంట్రుకల కుదుళ్లు షాక్‌కు గురవుతాయి. దాంతో వెంట్రుకలు ఊడిపోవడంతో పాటు, పెరుగుదల కూడా బాగా మందగిస్తుంది. రుగ్మత నుంచి కోలుకున్న తర్వాత పోషకాహారాన్ని తీసుకోకపోయినా ఇలాగే జరుగుతుంది. అలాగే స్ట్రెయిటెనింగ్, స్ట్రీక్స్ చేయించుకోవడం లాంటి సౌందర్య చికిత్సల వల్ల కూడా వెంట్రుకలు రసాయనికంగా దెబ్బతిని, మధ్యకు తెగిపోతాయి. ఇలాంటప్పుడు కూడా వెంట్రుకలు పెరగవు. అలాగే పెరిగే వయసుతో పాటు వెంట్రుకలు పెరిగే వేగం తగ్గుతుంది. చిన్న వయసులో పెరిగినంత వేగంగా 40 ఏళ్ల తర్వాత వెంట్రుకలు పెరగవు. వెంట్రుకల చివర్లు చిట్లిపోయినప్పుడు, పొడవు పరంగా వ్యత్యాసాన్ని కనిపెట్టలేం. చిట్లిపోయిన చివర్లు కత్తిరిస్తే వెంట్రుకలు పెరుగుతాయని అనుకోవడం కూడా అపోహే! ట్రిమ్మింగ్ వల్ల వెంట్రుకలు ఆరోగ్యంగా కనిపిస్తాయి.

మూల కారణాన్ని సరిదిద్దాలి

వెంట్రుకలు పెరగకపోవడానికి హార్మోన్ సమస్యలు, ముందరి రుగ్మతలు, పోషకాహార లోపం, థైరాయిడ్, పిసిఒడి సమస్యలు.. ఇలా ఎన్నో కారణాలుండవచ్చు. వీటిని కచ్చితంగా కనిపెట్టి, చికిత్స తీసుకుంటే పరిస్థితి మెరుగు పడుతుంది. అలాగే వెంట్రుకలకు చేయించుకునే సౌందర్య చికిత్సలకు కూడా దూరంగా ఉండాలి. అలాగే పోషకాహారంలో భాగంగా



ఖర్జూరాలు, వాల్‌నట్స్, బాదం, షియా, నువ్వులు, షియా, అవిసె గింజలు, పాలు, పన్నీర్, పప్పుధాన్యాలు తీసుకోవాలి. అలాగే ఒత్తిడిని తగ్గించుకోవాలి. అన్నిటికంటే ముఖ్యంగా సమస్యను ప్రారంభంలోనే గుర్తించి సరిదిద్దుకుంటే, ఫలితం మరింత మెరుగ్గా ఉంటుంది.

గృహ చిట్కాలతో...

మందార పూలు, ఆకులు, మెంతులు లాంటివన్నీ కొన్ని పోషకవిలువలను కచ్చితంగా కలిగి ఉంటాయి. అయితే ఇవన్నీ వెంట్రుకలు ఒత్తుగా కనిపించేలా, మెత్తగా ఉండేలా సహాయపడతాయి తప్ప మూల కారణాన్ని సరిదిద్దలేవు. వెంట్రుకల పెరుగుదల ఆగిపోయినప్పుడు కచ్చితంగా మూల కారణాన్ని సరిదిద్దుకునే ప్రయత్నాలు చేపట్టాలి.

డాక్టర్ స్వప్నప్రియ, కన్సల్టెంట్ డెర్మటాలజిస్ట్, కాస్మోస్యూర్ క్లినిక్, హైటెక్ సిటీ, హైదరాబాద్.

యాత్రలకు వెళుతున్నారా..!

శీతాకాలంలో యాత్రలు చేయడం అహ్లాదకరంగా ఉంటుంది. వాతావరణం చల్లగా ఉండడం వల్ల అలసట రాదు. ఉత్సాహంగా అనిపిస్తుంది. అయినప్పటికీ కొత్త ప్రదేశాలకు వెళ్లేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని నిపుణులు చెబుతున్నారు.

- శీతాకాలంలో అన్ని ప్రాంతాల్లో చలి తీవ్రంగానే ఉంటుంది. చలి నుంచి రక్షణ కల్పించే ఉన్ని దుస్తులు, చేతి తొడుగులు, సాక్స్, క్యాప్ వెంట ఉంచుకోవాలి. అన్నింటినీ రెండు జతలు అదనంగా సిద్ధం చేసుకోవడం మంచిది. రాత్రి ప్రయాణమైతే మందంగా ఉండే దుప్పట్లు వెంట తీసుకెళ్లాలి.
- చల్లని వాతావరణంలో ప్రయాణిస్తున్నప్పుడు తరచూ కాఫీ, టీ, ఆల్కహాల్ సేవించకూడదు. మితంగా వేడి పాలు తాగవచ్చు. కనీసం గంటకు ఒకసారైనా మంచి నీరు తాగుతూ ఉండాలి. లేదంటే శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడుతుంది.
- నీటిని ఎక్కువ సమయం వేడిగా ఉంచే వాటర్ ఫ్లాస్క్‌లు, థర్మల్ ఫ్లాస్క్‌లు, గ్రీన్ టీ ప్యాకెట్లను వెంట తీసుకెళ్లాలి. ప్రయాణం చేస్తూ గ్రీన్ టీ తయారు చేసుకుని తాగడం మంచి అనుభూతినిస్తుంది. దీని వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది.
- మంచు కురిసే ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఆ వాతావరణంలో కొంతసేపు గడపాలి. అప్పుడే శరీరం ఉష్ణోగ్రతను సర్దుబాటు చేసుకుంటుంది. దీనివల్ల అనారోగ్య సమస్యలు రావు.
- కొత్త ప్రదేశాల్లో కావాల్సిన ఆహారం దొరకకపోవచ్చు. ముందు జాగ్రత్తగా డ్రై ఫ్రూట్స్ గింజలు వెంట తీసుకెళ్లాలి.
- పాదాలకు చలి తగలకుండా ఉన్ని సాక్స్‌తోపాటు మడమల వరకూ పూర్తిగా కప్పి ఉంచే షూస్ లేదా కాన్వాస్ షూస్ ధరించాలి. దీంతో పాదాలు వెచ్చగా మారి కీళ్ల నొప్పులు రాకుండా చేస్తాయి.



- ప్రయాణం చేసేటప్పుడు చలిగాలులు సోకి చర్మం పొడారిపోతుంది. మాయిశ్చరైజర్, లిప్‌బామ్ వెంట ఉంచుకోవాలి. సూర్యరశ్మి నుంచి కళ్లకు రక్షణ కల్పించే సన్ గ్లాస్ ధరించాలి.
- ఫోన్ ఛార్జింగ్‌కి ఇబ్బంది లేకుండా పవర్ బ్యాంక్ తీసుకెళ్లాలి.
- వైద్యుని సలహా మేరకు జలుబు, దగ్గు, జ్వరం, తలనొప్పి సమస్యలకు సంబంధించిన మందులను వెంట తీసుకెళ్లాలి.

ప్రేరణ

బస్సుతో భరోసా



రొమ్ము క్యాన్సర్ పట్ల మహిళల్లో అవగాహన పెంచడం కోసం కేవలం వైద్య వృత్తికే పరిమితం కాకుండా సరికొత్త మార్గాన్ని ఎంచుకున్నారు హైదరాబాద్‌కు చెందిన బ్రెస్ట్ ఆంకాలజిస్ట్ **డాక్టర్ ప్రజ్ఞ చిగురుపాటి.** గ్రామీణ మహిళల కోసం ప్రత్యేకంగా 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్'ను నడుపుతున్న ప్రజ్ఞను 'నవ్య' పలకరించింది.

"మన దేశంలో రొమ్ము క్యాన్సర్ కేసులు త్వరితంగా పెరిగిపోడానికి కారణం అవగాహనా రాహిత్యమే! మరీ ముఖ్యంగా గ్రామీణ మహిళల్లో ఈ వ్యాధి పట్ల అవగాహన చాలా తక్కువ. దాంతో ఎంతో ఆలస్యంగా వైద్యులను ఆశ్రయిస్తూ, వ్యాధి ముదిరిపోయి, మృత్యువాత పడుతున్న సందర్భాలు కోకొల్లలు. ఈ ధోరణికి అడ్డుకట్ట వేయాలనే సంకల్పంతో, వ్యాధి నిర్ధారణ పరీక్షలను మహిళలకు చేరువ చేయడం కోసం 'బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్' పేరిట ఒక బస్సును ప్రారంభించాను. రొమ్ము క్యాన్సర్ నివారణ వైపు నా ప్రయాణం సాగడం వెనకొక ఆసక్తికరమైన కథ ఉంది. దీనికి కారణం అమ్మ. 2012లో అమ్మకు రొమ్ములో సమస్య తలెత్తింది. దాంతో అమ్మ తనకు క్యాన్సర్ సోకిందేమోనని చాలా భయపడిపోయింది. వైద్యం కోసం ఏ డాక్టర్‌ను కలవాలో కూడా మాకు ఆ రోజుల్లో తెలియదు. దాంతో మేము క్యాన్సర్ వైద్య నిపుణుడిని కలిసాం. ఆయన కొన్ని పరీక్షలు రాశారు. ఆ పరీక్షలు చేయించుకుంటున్న సమయంలో కూడా విపరీతమైన భయం. ఆ పరిస్థితులు నాపై బలమైన ముద్ర వేశాయి. అమ్మకు క్యాన్సర్ లేదని పరీక్షల్లో తేలిపోయింది. దాంతో అందరం ఊపిరి పీల్చుకున్నాం. నేను వైద్య విద్య చదవాలని.. అది కూడా రొమ్ము క్యాన్సర్‌కు సంబంధించిన స్పెషాలిటీ ఎంచుకోవాలని ఆ సమయంలో నిర్ణయించుకున్నా. అలా అమ్మకొచ్చిన అస్వస్థత నన్ను క్యాన్సర్ వైద్య విద్య వైపు నడిపించింది. చెన్నైలో రామచంద్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి అయిన తర్వాత ముంబయిలోని టాటా మెమోరియల్‌లో ఫెలోషిప్ పూర్తి చేసుకున్నా. క్యాన్సర్ రోగులకు రొమ్ము పునర్‌నిర్మాణంలో నైపుణ్యం సాధించటం కోసం యూకేలో ఒక కోర్సు ఉంది. అది పూర్తి చేశాక, హైదరాబాద్ వచ్చి వైద్య వృత్తిని ప్రారంభించా.

మొదట్లో...

నేను వైద్య వృత్తిని ప్రారంభించిన రోజుల్లో రొమ్ము క్యాన్సర్‌పై ప్రజల్లో ఎక్కువ అవగాహన ఉండేది కాదు. క్యాన్సర్‌ను గుర్తించే పద్ధతులు కూడా ఎక్కువ ప్రచారంలో లేవు. దీని వల్ల గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు ఎంతో నష్టపోతున్నారని గమనించాం. ఎక్కువ మంది మహిళలు రొమ్ములలో సమస్యలతో డాక్టర్ల దగ్గరకు వెళ్లటానికి ఇబ్బంది పడుతూ ఉంటారు. డాక్టర్ల దగ్గరకు వారు రారు కాబట్టి.. మనమే వాళ్ల దగ్గరకు వెళ్తే బావుంటుందనే ఉద్దేశంతో బ్రెస్ట్ హెల్త్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రారంభించాం. దీనిలో అన్ని అత్యాధునిక రోగ నిర్ధారణ పద్ధతులు ఉంటాయి. వీటి ద్వారా మహిళలను పరీక్షించి వారికి ఏవైనా సమస్యలు న్నాయా అనే విషయాన్ని నిర్ధారిస్తారు. ఇలా ఇప్పటి దాకా తెలంగాణలోని అనేక జిల్లాలలో వేల సంఖ్యలో మహిళలను పరీక్షించాం. రొమ్ము క్యాన్సర్ ఉన్నవారికి ఉచితంగా చికిత్సను కూడా అందిస్తున్నాం. కేవలం గ్రామీణ ప్రాంతాల్లోని పేద మహిళలకు మాత్రమే కాకుండా- వారితో మమేకమయిపోయిన ఆశా వర్కర్స్‌కు కూడా పరీక్షలు నిర్వహించాం. దీని వల్ల రెండు రకాల లాభాలు ఉంటాయి. ఆశా వర్కర్లకు సరైన వైద్య సదుపాయం లభిస్తుంది.. అంతే కాకుండా వారికి ఈ అంశంపై అవగాహన ఉండటం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఇతరులకు వారు ఈ సమస్య తీవ్రత చెప్పగలుగుతారు. దీని వల్ల మంచి ఫలితాలు లభించాయి.

> **మర్చిపోలేని అనుభవం**
>
> కొందరు మహిళలకు గర్భిణిగా ఉన్నప్పుడు, లేదా ప్రసవం తర్వాత ఏడాది లోపు రొమ్ము క్యాన్సర్ సోకవచ్చు. ఒక సారి 29 ఏళ్ల గర్భిణి నన్ను కలిసింది. ఆమెకు రెండు రొమ్ముల్లోను గడ్డలు ఉన్నాయి.
>
> 
>
> మొదట్లో అవి క్యాన్సర్‌కు సంబంధించినవి కావని వైద్యులు నిర్ధారించారు. కానీ నేను పరీక్షలు చేయిస్తే అవి క్యాన్సర్ గడ్డలని తేలింది. అప్పుడు వైద్యం మొదలుపెట్టి.. మళ్లీ ఆమెకు రొమ్ములు పునర్‌నిర్మించటానికి రెండేళ్ల సమయం పట్టింది. ఆ సమయంలో ఆమె తన స్థైర్యం కోల్పోలేదు. శరీరంలోని క్యాన్సర్‌తో పోరాడి గెలిచింది. ఇలాంటి వారు ఎంతో మంది ఉన్నారు. వారందరి గురించి ప్రపంచానికి తెలిస్తే- క్యాన్సర్ బాధితులకు స్ఫూర్తి కలుగుతుంది.

ఉచితంగానే...

రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించే పరీక్షలు కూడా ఒక క్రమ పద్ధతిలో సాగాలి. సాధారణంగా రొమ్ములో గడ్డ అనగానే వైద్యులు మామోగ్రాఫ్ పరీక్షనే సూచిస్తూ ఉంటారు. కానీ 40 ఏళ్ల లోపు మహిళలు మామోగ్రామ్ చేయించుకోవడం సరి కాదు. కాబట్టి మేం భౌతిక పరీక్షలు, ఇతరత్రా పరీక్షలతో వ్యాధిని అంచనా వేసి, అవసరమైన వారికే మామోగ్రామ్ చేపడతాం. పరీక్షలో వ్యాధి నిర్ధారణ అయిన పక్షంలో తదుపరి చికిత్సల గురించి వివరిస్తాం. ఆర్థిక పరిస్థితి సహకరించని వారికి మేమే ఉచితంగా పూర్తి చికిత్సను అందిస్తాం. కొన్ని సందర్భాల్లో రొమ్ముల్లో క్యాన్సర్ కాని గడ్డలు కూడా ఏర్పడుతూ ఉంటాయి. వాటికి సంబంధించిన చికిత్సలను కూడా ఉచితంగా అందిస్తున్నాం. మా దగ్గర చికిత్స పొంది మళ్లీ సాధారణ జీవితం జీవిస్తున్న వారిని చూస్తుంటే చాలా ఆనందంగా ఉంటుంది. ఇంకా మరింత మందికి సాయం చేయాలనే ఉత్సాహం కలుగుతుంది."

• గోగుమళ్ల కవిత

కళ్ల కింద నలుపు తగ్గాలంటే...

ఒత్తిడి, నిద్రలేమి, హార్మోన్ల మార్పుల కారణంగా కళ్ల కింద నల్లని వలయాలు ఏర్పడుతుంటాయి. పోషకాహారంతోపాటు సరైన నిద్ర ఉండేలా చూసుకుంటూ కొన్ని చిట్కాలు పాటిస్తే ఈ సమస్య నుంచి బయటపడవచ్చు.

- రాత్రి పడుకునేముందు రెండు చెంచాల ఆలివ్ నూనెని కొద్దిగా వేడి చేసి కళ్ల చుట్టూ రాయాలి. వేళ్లతో సున్నితంగా మర్దన చేయాలి. ఉదయాన్నే గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే కళ్ల చుట్టూ రక్త ప్రసరణ మెరుగై నలుపుదనం తగ్గుతుంది.
- ఒక చెంచా శనగపిండిలో రెండు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల కింద రాసి పది నిమిషాలు ఆరిన తరవాత మంచి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా రెండు రోజులకోసారి చేస్తే నల్లని వలయాలు తొలగిపోతాయి.
- కలబంద గుజ్జును తీసుకుని చల్లని నీళ్లలో ముంచి దానిని కళ్ల చుట్టూ పట్టించాలి. పదిహేను నిమిషాల తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారం రోజులు చేస్తే ఫలితం కనిపిస్తుంది
- రెండు చెంచాల బియ్యం పిండిలో మూడు చెంచాల నీళ్లు పోసి ముద్దలా కలపాలి. ఈ మిశ్రమాన్ని కళ్ల చుట్టూ పరచాలి. ఇరవై నిమిషాలు ఆరిన తరవాత నీళ్లతో శుభ్రం చేసుకుంటే చాలు.
- అరకప్పు టమాటా రసంలో రెండు చెంచాల శనగపిండి కలపాలి. ఈ మిశ్రమంతో కళ్ల కింద మర్దన చేయాలి. పది నిమిషాల తరవాత మంచినీళ్లతో శుభ్రం చేసుకుంటే ప్రయోజనం కనిపిస్తుంది.
- రాత్రి పడుకునేముందు కళ్ల కింద కొబ్బరి నూనె రాసుకుని ఉదయాన్నే గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే సమస్య తగ్గుతుంది.



ఇలా చేస్తే వెంటనే ఉపశమనం

పిల్లలకు, పెద్దలకు ఆకస్మికంగా చిన్న ఆరోగ్య సమస్యలు ఎదురవుతుంటాయి. అలాంటప్పుడు ఇంట్లో ఉండే వాటితోనే కొన్ని చిట్కాలు పాటించి ఉపశమనం పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు.

వాంతులు



- చిన్న గ్లాసు నీళ్లలో నాలుగు లవంగాలు వేసి బాగా మరిగించాలి. గోరువెచ్చగా చల్లారిన తరవాత ఈ నీళ్లను వడకట్టి తాగితే వెంటనే వాంతులు ఆగిపోతాయి.

కడుపునొప్పి



- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి రెండు చెంచాల వాము వేసి దోరగా వేయించాలి. దీనికి అరచెంచా నల్ల ఉప్పు కలిపి కొద్ది కొద్దిగా నోట్లో వేసుకుంటూ బాగా నమిలి తినాలి. పావుగంటలో కడుపు నొప్పి, అపానవాయువుల సమస్యలు తగ్గిపోతాయి. కడుపులో జీర్ణక్రియ మెరుగవుతుంది కూడా.

తలతిరగడం



- రెండు చెంచాల సోంపులో ఒక చెంచా పటిక బెల్లం కలిపి తినాలి. వెంటనే శరీరంలో రక్తప్రసరణ సజావుగా జరిగి తలతిరగడం తగ్గుతుంది. తక్షణ శక్తి కూడా లభిస్తుంది.

విరేచనాలు



- అరకప్పు కమ్మని పెరుగులో ఒక చెంచా మెంతులు కలుపుకొని మెల్లగా తినాలి. పది నిమిషాల్లో విరేచనాలు తగ్గిపోతాయి. ఒక చెంచా పంచదారలో రెండు చుక్కల నీళ్లు కలిపి వేడిచేస్తే వచ్చే పాకం తిన్నా కూడా మంచి ఫలితం కనిపిస్తుంది.

న్యుమోనియా



- అరగ్లాసు గోరువెచ్చని నీటిలో చిటికెడు ఇంగువ కలుపుకొని తాగితే ముక్కులో శ్లేష్మం తగ్గి వెంటనే ఉపశమనం కలుగుతుంది.

పంటి నొప్పి



- చిన్న అల్లం ముక్కను తొక్కు తీసి సన్నగా తురమాలి. ఈ తురుముని వేళ్లతో పిండితే రసం వస్తుంది. రోజుకు రెండుసార్లు ఒక చెంచా అల్లం రసం తీసుకుంటే పంటినొప్పి, చిగుళ్ల వాపు క్రమంగా తగ్గుతాయి. ఈ రసాన్ని కొద్దిగా వేడిచేసి దాన్ని నొప్పి ఉన్న ప్రదేశంలో రాసినా ప్రయోజనం ఉంటుంది.

గాయాలు



- కూరలు తరిగేటపుడు చాకుతో వేలు కోసుకున్నా, పిల్లలు ఆడుకుంటూ దెబ్బలు తగిలించుకున్నా ఇలా ఏ చిన్న గాయమైనా వాటిపై కొద్దిగా పసుపును అద్దాలి. పసుపు యాంటీబయటిక్‌లా పనిచేసి గాయాన్ని త్వరగా మాన్పుతుంది.



ప్రియా సరోజ్... ఈమె గురించి ఇప్పుడు నెట్టింట తెగ వెతికేస్తున్నారు. భారత క్రికెటర్ రింకూసింగ్‌తో ఆమె పెళ్లి నిశ్చయం కావడమే అందుకు కారణం. వాస్తవానికి అతడికి కాబోయే సతీమణిగానే కాదు... రాజకీయ నాయకురాలిగా... యువ పార్లమెంటు సభ్యురాలిగా... ప్రియాకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది.

రింకూ ప్రియ సఖి

తండ్రి వారసత్వంతో రాజకీయాల్లోకి వచ్చినా... నిత్యం జనం మధ్య ఉంటూ... వారి సమస్యలు తెలుసుకొంటూ... తనదైన ఒక మార్గాన్ని నిర్మించుకున్నారు ప్రియా సరోజ్. పద్దెనిమిదేళ్లకే రాజకీయాల్లోకి వచ్చిన ఆమె... గత యూపీ అసెంబ్లీ ఎన్నికలప్పుడు తండ్రి గెలుపులో కీలక పాత్ర పోషించారు. ఎంపీగా పోటీ చేసి తనూ విజయం సాధించారు. ఉత్తరప్రదేశ్ వారణాసిలో పుట్టి పెరిగిన 26 ఏళ్ల ప్రియా... ఢిల్లీలోని 'ఎయిర్‌ఫోర్స్ గోల్డెన్ జూబ్లీ ఇనిస్టిట్యూట్'లో పాఠశాల విద్యాభ్యాసం పూర్తి చేశారు. 'ఢిల్లీ విశ్వవిద్యాలయం' నుంచి బీఏ పట్టా పొందారు. నోయిడా 'అమిటీ యూనివర్సిటీ'లో ఎల్ఎల్‌బీ చదివారు. అనంతరం న్యాయవాదిగా కొంత కాలం సుప్రీమ్‌కోర్టులో ప్రాక్టీస్ చేశారు.

ఆమె తండ్రి తుఫానీ సరోజ్ మూడుసార్లు ఎంపీ. ప్రస్తుతం సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచిన ప్రియా... బడికి వెళ్లే రోజుల్లోనే రాజకీయాలపై మక్కువ పెంచుకున్నారు. చిన్న వయసులోనే రాజకీయ వారసత్వాన్ని అందుకున్నారు. పార్టీ నిర్వహించే ప్రతి కార్యక్రమంలో పాల్గొంటూ... ప్రజల మధ్యనే ఉంటూ... ఎంతో అనుభవం గడించారు. యూపీ శాసనసభకు జరిగిన గత ఎన్నికల్లో తండ్రి తరుపున అన్నీ తానై ప్రచారం నిర్వహించారు. వీటన్నిటినీ పరిగణనలోకి తీసుకున్న పార్టీ.. 2024 పార్లమెంటు ఎన్నికల్లో ఆమెకు సీటు ఇచ్చింది. మఛిలీషహర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన ఆమె... 35 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందడమే కాదు... పార్టీ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టారు. అంతేకాదు... లోక్‌సభకు ఎన్నికైన రెండో అతిపిన్న వయస్కురాలిగానూ చరిత్ర సృష్టించారు.

రింకూతో పరిచయం...

రెండేళ్ల కిందట జరిగిన ఐపీఎల్ మ్యాచ్ ఆఖరి ఓవర్‌లో ఐదు సిక్స్‌లు బాది కోల్‌కతా నైట్ రైడర్స్‌ను గెలిపించడంతో రింకూసింగ్ పేరు మారుమోగింది. గుజరాత్ టైటాన్స్‌తో తలపడిన ఆ పోరులో నైట్‌రైడర్స్ ఓటమి ఖాయమనుకున్నారు అంతా. అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసి చూపించిన రింకూ... ఆ తరువాత భారత టీ20 క్రికెట్ జట్టులో సభ్యుడయ్యాడు. దిగువ మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన ఈ యూపీ హార్డ్ హిట్టర్ గురించి అప్పట్లో ఎన్నో కథనాలు ప్రచురితమయ్యాయి. కష్టపడి ఎదిగిన అతడి నేపథ్యం ప్రియను ఆకట్టుకుంది.

రెండేళ్ల కిందట ప్రియా ప్రాణమిత్రులొకరు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇద్దరూ కలిశారు. ఆ ఫ్రెండ్ తండ్రి కూడా క్రికెటర్. తనే రింకూను ప్రియకు పరిచయం చేశారు. తరువాత ఇరువురి మాటలు కలిశాయి. అభిరుచులు కలిశాయి. ప్రాంతాలూ ఒక్కటే. ఒకరు రాజకీయ నాయకురాలు... ఇంకొకరు భారత బ్యాట్స్‌మన్... నేపథ్యాలు వేరైనా... కెరీర్ పరంగా ఇద్దరికీ ఎంతో ప్రజాదరణ. లక్షల్లో అభిమానులు. క్రమంగా వారి స్నేహం ప్రేమగా మారింది. ఈ ప్రేమను వివాహ బంధంగా మార్చుకొని... జీవితాంతం కలిసి నడవాలని నిర్ణయించుకున్నారు. తమ ప్రేమ గురించి పెద్దలకు చెప్పి, వారి అనుమతి తీసుకున్నారు.



ఏఐ హడావుడి...

గత కొంత కాలంగా రింకూ పెళ్లి గురించి రకరకాల వార్తలు వస్తున్న నేపథ్యంలో... ఇటీవల ప్రియా తండ్రి ఆ విషయాన్ని నిర్ధారించారు. రింకూ తండ్రితో పెళ్లి గురించి మాట్లాడినట్టు ఆయన వెల్లడించారు. 'వారిద్దరికీ ఏడాదికి పైగా స్నేహం కొనసాగుతోంది. ఒకరినొకరు ఇష్టపడ్డారు. కుటుంబ సభ్యుల అనుమతితో ఒకటి కావాలనుకున్నారు' అంటూ తుఫానీ సరోజ్ చెప్పారు. ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌తో రింకూ బిజీ. నెలాఖరులో ప్రారంభం కానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలతో ప్రియా కూడా బిజీ. ఈ నేపథ్యంలో పార్లమెంట్ సమావేశాల అనంతరం నిశ్చితార్థం జరుపుతామని ప్రియా తండ్రి తెలిపారు. ఇదిలావుంటే... ఈ వార్త వచ్చినప్పటి నుంచీ వీరిద్దరి నిశ్చితార్థం జరిగిపోయిందంటూ ఏఐ సాయంతో రూపొందించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయి. అదంతా నిజం కాదంటూ తుఫానీ వివరణ ఇవ్వాల్సివచ్చింది.

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

కృష్ణానది కుడి కరకట్ట గోడ నిర్మాణానికి పరిపాలన అనుమతి

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది కుడి కరకట్టకు సంబంధించి ప్రకాశం బ్యారేజ్ దిగువన 0.900 కిలోమీటర్ నుంచి 2.610 కిలోమీటర్ వరకు తాడేపల్లి మండలపరిధిలో వరద రక్షణ గోడ నిర్మాణానికి పరిపాలన అనుమతి మంజూరైంది. రూ.294.20 కోట్లకు పరిపాలన అనుమతి మంజూరు చేస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ జీ.సాయి ప్రసాదు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో త్వరలోనే టెక్నికల్ శాంక్షన్స్ తీసుకొని టెండర్లు పిలిచి ఏజెన్సీని ఖరారు చేస్తారు. అనంతరం వరద రక్షణ గోడ నిర్మాణ పనులను ప్రారంభిస్తారు. ఈ గోడ నిర్మాణం పూర్తి అయితే తాడేపల్లికి రాబోయే రోజుల్లో వరద నీటి ప్రవాహం నుంచి ఎలాంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

ఈనామ్‌లో 4 లక్షల మిర్చి టిక్కీల గల్లంతు

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డు అమలు జరుగుతున్న జాతీయ వ్యవసాయ మార్కెట్(ఈనామ్) విధానంలో దాదాపుగా నాలుగు లక్షల మిర్చి టిక్కీలు గల్లంతయ్యాయి. గేట్ వద్ద ఎంట్రీ జరిగిన లాట్ ఐడీలు క్లియర్ కాలేదు. బిడ్డింగ్ వేయడం ఆ తర్వాత వదిలేయడం, అలా వదిలేసిన మిర్చి టిక్కీలకు మరో లాట్ ఐడీ జనరేట్ చేయించుకొని వేరొక వ్యాపారి కొనుగోలు చేయడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైనట్లుగా అధికారవర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం యార్డులో ఎలాంటి నిల్వలు లేవు. ఈ నేపథ్యంలో ఎవరైతే ఇలాంటి అసంబద్ధమైన విధానాలకు పాల్పడ్డారో ఆయా వ్యాపారస్థులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసే ప్రక్రియని యార్డు అధికారవర్గాలు ప్రారంభించాయి. రెండు, మూడు రోజుల నుంచి ఈ విధమైన నోటీసులు అందుకొంటున్న వ్యాపారులు బెంబేలెత్తిపోతున్నారు.

లోకేశ్ జన్మదిన వేడుకలు

గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): యువనేత, మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు నేపథ్యంలో బుధవారం బ్రాడీపేటలోని అంధుల పాఠశాలలో విద్యార్థులకు దుప్పట్లు, పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త బండపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గుర్రపుశాల రామకృష్ణ, గడ్డం శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

మాతృ మరణాలను నియంత్రించండి : డీఎంహెచ్‌వో

గుంటూరు మెడికల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్యపరమైన సేవా లోపాల కారణంగా మాతృ మరణాలు సంభవించకూడదని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మి ఆరోగ్య సిబ్బందికి ఉద్బోధించారు. బుధవారం తన ఛాంబర్‌లో సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ మాతృ మరణాల సమీక్షలో ఆమె మాట్లాడారు. తుళ్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని పెదపరిమిలో డిసెంబర్ నెలలో నమోదైన మాతృ మరణంపై కమిటీ సభ్యులు సమీక్ష జరిపారు. సమావేశంలో సభ్యులు ఏపీవీవీపీ ఆస్పత్రుల వైద్యసేవల జిల్లా సమన్వయకర్త డాక్టర్ ఎం.మజిదాబి, వైద్యులు అరుణ, బుచ్చిబాబు, సుధీర్‌బాబు, ఆదిత్య ప్రదీప్ రెడ్డి, రాధికరాయుడు, శ్రావణ్‌బాబు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా చెరుకూరి

గుంటూరు(తూర్పు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడిగా గుంటూరుకు చెందిన చెరుకూరి తిరుపతిరావు నియమితులైయ్యారు. స్థానిక లాలుపురం రోడ్డులోని జిల్లా కార్యాలయంలో బీజేపీ జిల్లా క్రియాశీలక సభ్యత్వ ఇన్‌చార్జీ కొత్తూరు వెంకట సుబ్బారావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చెరు కూరి తిరుపతరావుని ఏకగ్రీవంగా జిల్లా అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు జిల్లా ఎన్నికల రిటర్నింగ్ ఇన్‌చార్జి ఉప్పలపాటి శ్రీనివాసరాజు, జిల్లా పరిశీలకుడు చిగురుపాటి కుమారస్వామి ప్రకటించారు. జిల్లా సహ ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నేరెళ్ల మాధవరావు, వెంకటకృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు యడ్లపాటి స్వరూపరాణి, మాజీ మంత్రి శనక్కాయల అరుణ ఆయనను అభినందించారు.

ఇదేమి మాయ

- రాధాకృష్ణ సెంటర్ సిగ్నల్స్ వద్ద డివైడర్ మూత
- మాయాబజార్ సెంటర్‌లో తెరుచుకున్న వైనం



రాధాకృష్ణ థియేటర్ సెంటర్‌లో డివైడర్‌ను మూసి ఏర్పాటు చేసిన స్టాప్ బోర్డులు



మాయాబజార్ సెంటర్లో తెరుచుకున్న డివైడర్

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఈస్ట్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అత్యంత కీలకమైన జంక్షన్లలో ఒకటైన రాధాకృష్ణ థియేటర్ సెంటర్‌లోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఉన్నట్టుండి డివైడర్ మూతపడింది. అతి చిన్న జంక్షన్ అయిన మాయాబజార్ సెంటర్లో డివైడర్ తెరుచుకుంది..దీని వెనకున్న మతలబు ఏంటో అర్థం కాలేదు.

రాధాకృష్ణ థియేటర్ సెంటర్లో ఎన్నో సంవత్సరాల క్రితం ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఎంత రద్దీ సమయంలోనైనా పెద్ద సంఖ్యలో వాహనాలు వచ్చినప్పటికీ ఈ జంక్షన్లో పెద్దగా సమస్యలు ఎదురు కాకుండా ట్రాఫిక్ సాఫీగానే సాగిపోతుంటుంది. కొన్ని సందర్భాల్లో సాయంత్రం వేళ ఈ జంక్షన్ లో వాహనాలు కిక్కిరిసిపోతుంటాయి. అయితే సిగ్నల్స్ ఉండడంతో పెద్దగా ఇబ్బంది ఉండటం లేదు. అటువంటిది ఇటీవల ఈ జంక్షన్‌లో మూవబుల్ దిమ్మెలతో డివైడర్ ఏర్పాటు చేసి జంక్షన్‌ను మూసివేశారు. అదే సమయంలో చిన్న జంక్షన్ అయిన మాయాబజార్ సెంటర్‌లో డివైడర్‌ను తెరిచారు. ఈ జంక్షన్‌లో ఇరువైపులా రోడ్డు చాలా ఇరుకుగా ఉంటుంది. ఇక్కడ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. అదే జరిగితే ఈ ప్రాంతం మరింత ట్రాఫిక్ వలయంలో చిక్కుకునే ప్రమాదం ఉంది. అంతేగాక ఇక్కడ సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేస్తే బస్టాండ్ వైపు నుంచి మార్కెట్ వైపు వచ్చే వాహనాలు నిలవాలంటే చిన్న రోడ్డు కావడంతో పాత గుంటూరు పోలీస్ స్టేషన్ జంక్షన్ వరకు వాహనాలు నిలిచిపోయే అవకాశం ఉంటుంది. ఆర్టీసీ బస్టాండ్, పొన్నూరు రోడ్డు వైపు నుంచి లీలామహల్ థియేటర్ మీదుగా కొత్తపేటలోకి వెళ్లాల్సిన వారు కార్పొరేషన్ కార్యాలయం వద్దకు వచ్చి కుడి వైపు తిరిగివెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఈ జంక్షన్‌లో వాహనాల రద్దీ మరింతగా పెరిగి రాకపోకల కు తీవ్ర అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. సాఫీగా సాగిపోతున్న రాధాకృష్ణ థియేటర్ వద్ద డివైడర్ మూసివేయడం, అవసరం లేని మాయాబజార్ సెంటర్లో సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయబోతుండటం వల్ల తమకు అదనపు ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు తప్ప మరొకటి లేదని ప్రజలు వాపోతున్నారు.

ఈ ప్రయోగం వెనుక మతలబు ఏమిటో..?

అయితే ఈ నిర్ణయం వెనుక ఏదో మతలబు దాగి ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. రాజకీయ ఒత్తిడి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చర్చ జరుగుతోంది. ఆ ప్రాంతంలోని వస్త్ర, వ్యాపార సంస్థల నుంచి కొందరికి ఆశించిన మేర ప్రయోజనం కలగకపోవడమే కారణమనే విమర్శలు కూడా ఉన్నాయి. అంతేగాక కొంతమంది స్వప్రయోజనాలను ఆశించి మాయాబజార్ సెంటర్లో డివైడర్ తెరిచారనే వాదన కూడా ఉంది. మాయాబజార్ సెంటర్లో డివైడర్ తెరిచినప్పటికీ, రాధాకృష్ణ థియేటర్ సెంటర్లో మూసివేయకుండా ఉంటే సరిపోతుందని పలువురు అంటున్నారు. పోలీసు ఉన్నతాధికారు లు, ట్రాఫిక్ అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆటోనగర్ అభివృద్ధిపై నిర్లక్ష్యాన్ని సహించను

- అధికారులపై ఎమ్మెల్యే నసీర్ ఆగ్రహం



ఆటోనగర్ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): 'గుంటూరుకు తలమానికమైన ఆటోనగర్లో విద్యుత్ వ్యవస్థ సరిగా లేదు.. రోడ్లు సక్రమంగా లేవు.. శానిటేషన్ పట్టించుకోవడం లేదు.. అధికారులేం చేస్తున్నారు? ఆటోనగర్‌పై ఎందుకంత నిర్లక్ష్యం? వెంటనే అన్ని మౌలిక వసతులు కల్పించండి! లేదంటే చర్యలు తప్పవు' అంటూ గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అధికారులపై విరుచుకుపడ్డా రు. ఆటోనగర్లో బుధవారం ఆయన పర్యటించారు. ఆటోనగర్లో కనీస సదుపాయాలు కల్పించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవ హరించడమేంటని ప్రశ్నించారు. ఆటోనగర్ వాసుల కు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వ ర్యంలో సబ్సిడీపై రుణాలు అందించి, వారి వ్యాపారాలకు తోడుగా నిలుస్తామని ప్రకటించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు తన సొంత నిధులు రూ.50 వేలు ఇస్తానని తెలిపారు. కార్యక్రమంలో అధికారులు, ఆటోనగర్ వివిధ అసోసియేషన్ సభ్యులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

చంద్రబాబు కృషితోనే విశాఖ ఉక్కుకు ఊపిరి

విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదాన్ని కాపాడుతూ సీఎం చంద్రబాబు చేసిన కృషే విశాఖ ఉక్కు పరిశ్రమకు ఊపిరులూదిందని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. గుంటూరులోని తన కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అప్పుల్లో కూరుకుపోయిందని, దీంతో అడ్వాన్స్ ఫండ్ కింద జీఎస్టీ చెల్లింపులకు రూ.500 కోట్లు, బ్యాంకు అప్పులకు రూ.1150 కోట్లు రెండు విడతల్లో కేంద్రం సాయం అందించిందని తెలిపారు. గతంలో కేసుల మాఫీ కోసం జగన్ రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, విశాఖ ఉక్కును బలిపెట్టారని ఆరోపించారు.

శాశ్వత సభ్యత్వం తీసుకున్న రావిపాటి సాయికృష్ణ

గుంటూరు, జన వరి 22(ఆంధ్రజ్యోతి): తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావి పాటి సాయికృష్ణ టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్, గళ్లా మాధవిల సమక్షంలో సోమవారం ఆయన పార్టీ శాశ్వత సభ్యతాన్ని పొందారు. కార్యక్రమంలో కొమ్మినేని సాంబశివరావు, ఎం.రాజేశ్, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

డ్రైవర్ల అప్రమత్తతతోనే ప్రమాద రహిత ప్రయాణాలు

- ఉప రవాణా కమిషనర్ సీతారామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామిరెడ్డి

గుంటూరు (విద్య), జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులను సుఖంగా, భద్రంగా గమ్యం చేర్చాలన్నా, రోడ్డు ప్రమాదాలను నివారించాలన్నా డ్రైవర్ల అప్రమత్తతోనే సాధ్య మవుతుందని గుంటూరు జిల్లా ఉపరవాణా కమిషనర్ కే సీతారామిరెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్స్ యూనివర్సిటీలో బుధవారం విజ్ఞాన్స్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను ఘనంగా నిర్వ హించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, తెనాలి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు టీ.రాఘవరావ్, మధుసూదన్‌రావ్, చేబ్రోలు మండలం ఎస్ఐ డీవీ క్రిష్ణ, విజ్ఞాన్స్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, డ్రైవర్లు, ట్రాన్స్‌పోర్ట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధి యూనిట్లకు రాయితీతో రుణాలు : డీఆర్డీఏ పీడీ

గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా సంఘ సభ్యులైన ఎస్సీ మహిళలకు ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన(పీఎం-అజయ్) ద్వారా రాయితీతో కూడిన రుణాలు అందిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ టీవీ విజయలక్ష్మి చెప్పారు. గుంటూరులోని జిల్లా కార్యాలయంలో 82 మంది లబ్ధిదారులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయ్, సెర్ప్ ఉన్నతి డైరెక్టర్ రాజా ప్రతాప్, శారమ్మ హాజరయ్యారు.

కానిస్టేబుల్‌నని బెదిరించి అత్యాచారయత్నం

గుంటూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): గుంటూరుకి చెందిన ఓ జంట జాతీయ రహదారిపై తక్కెళ్ళపాడు-బుడంపాడు మధ్య రోడ్డు పక్కన ఉంది. ఇది గమనించిన గోపి అనే యువకుడు వారి వద్దకు వెళ్లి తాను కానిస్టేబుల్‌నంటూ బెదిరించి ఆ యువకుడిపై దాడి చేసి ఆమెపై అత్యాచారయత్నం చేశాడు. ఇంతలో సమీపంలోని జనం రావటంతో నిందితుడు గోపి అక్కడి నుంచి పరారయ్యాడు. చేబ్రోలు మండల పరిధిలోని వేజెండ్ల గ్రామానికి చెందిన గోపి గతంలో కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇదే తరహాలో ఓ జంటను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై కొత్తపేట పోలీసులు గతంలో గోపీని అరెస్టు చేశారు. బెయిల్ పై బయటకు వచ్చిన గోపి మరో నేరానికి ఒడగట్టాడు. పాతగుంటూరు పోలీసులు గోపీని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పట్టాభూముల్లో ఇసుక తవ్వకాలకు 15 రోజుల్లో అనుమతి

- కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశాలు



కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, జేసీ, డీఆర్‌వో

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాల అను మతుల కోసం వచ్చిన దరఖాస్తు లను 15 రోజుల్లోపు సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు పూర్తి చేసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆమోదానికి ప్రతిపాదన లు అందించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫ రెన్స్ హాల్లో జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా సత్వరమే ఇసుకను అందించేందుకు నిబంధ నల ప్రకారం ఇసుక తవ్వకాల అనుమతుల మంజూరుకు అధికారులు చర్యలు తీసుకో వాలన్నారు. జిల్లాలో 17 ఎకరాల పట్టా భూముల్లో, 4.93 హెక్టార్ల ప్రభుత్వ భూముల్లో ఇసుక తవ్వకాలకు చేసుకున్న దరఖాస్తు లను కమిటీలో అమోదించారు. వీటికి సంబంధించి పర్యావరణ అనుమతులు వచ్చిన వెం టనే తవ్వకాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా 70 ఎకరా ల్లో ఇసుక తవ్వకాల కోసం వచ్చిన దరఖాస్తులను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో జేసీ ఏ భార్గవతేజ, డీఆర్వో ఖాజా వలి, మైన్స్ అండ్ జియాలజి విభాగం అధికారి వెంకటసాయి, ఉప రవాణా కమిషనర్ కె సీతారామిరెడ్డి, భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, పంచాయతీ అధికారి బీఎస్ఎస్ సాయికుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నజీమా బేగం తదితర అధికారులు పాల్గొన్నారు.

అప్పు తీసుకుని ఎగ్గొట్టిన ముగ్గురు పోలీసుల సస్పెన్షన్

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అప్పు తీసుకుని ఎగ్గొట్టిన ముగ్గురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేస్తూ బుధవారం ఎస్పీ సతీష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, ఏఆర్ కానిస్టేబుల్ మరో హోంగార్డును సస్పెండ్ చేశారు. ముగ్గురు పోలీస్ సిబ్బంది తమ సహోద్యోగులు, స్నేహితులు, తెలిసిన వారు, చిట్ ఫండ్ సంస్థలు, ప్రైవేటు ఆర్థిక లావాదేవీల సంస్థల వద్ద ప్రామిసరీ నోట్లు, బ్యాంకు చెక్కులను తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారని, వాటిని చెల్లించకపోవడంతో వీరిపై శాఖాపరమైన క్రమ శిక్షణ చర్యలు తీసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న కుమార్ రాజు

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కవి, ప్రముఖ రచయిత, గుంటూరు జిల్లా రచయితల సంఘం కార్యదర్శి బుర్రి కుమార్‌రాజు తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఆయనకు విజయవాడలోని కౌత పూర్ణానంద్ విలాస్ కళావేదిక నందు తెలుగు భాషా, తెలుగు సాహిత్యం, సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కుమార్‌రాజు చేస్తున్న సేవలను గుర్తించి తెలుగు కీర్తి జాతీయ ప్రతిభా పురస్కారంతో అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, బోయి భీమన్న సాహిత్య నిధి ఛైర్‌పర్సన్ బోయి హైమావతి, ఏపీఎస్ పీఎఫ్ కమాండెడ్ డా.కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి, జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి భూషణం, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి, టీడీపీ రాష్ట్ర మహిళా అధికార ప్రతినిధి గద్దె అనంతలక్ష్మి, శ్రీనాధుని 13వ తరం వంశీయులు కావూరి శ్రీనివాస శర్మ తదితరుల చేతుల మీద ఘనంగా సన్మానించారు.

సమస్యలపై మండలిలో గళం వినిపించేందుకు అవకాశం ఇవ్వండి

- ఆలపాటి రాజేంద్రప్రసాదు, పేరా బత్తుల రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న ఆలపాటి రాజేంద్రప్రసాదు, పాల్గొన్న పేరా బత్తుల రాజశేఖర్, పి.అశోక్‌బాబు తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ, విశ్రాంత ఉద్యో గులు, పట్టభద్రుల సమస్యలపై మండలిలో గళం వినిపించేందుకు అవకాశం ఇవ్వాలని గుంటూరు, కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లాల అభ్యర్థులు ఆలపాటి రాజేం ద్ర ప్రసాదు, పేరా బత్తుల రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. గుంటూరులోని జేకేసీ రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశానికి రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 25 ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘా లు హాజరయ్యాయి. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు హాజరయ్యారు. ఆలపాటి రాజేంద్రప్రసాదు మాట్లాడుతూ పట్టభద్రులకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పేరా బత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ విధానం ప్రవేశపెట్టిందని, ఉద్యోగులకు 43శాతం ఫిట్‌మెంట్, పీఆర్సీ కల్పించిందని గుర్తుచేశారు. కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్నట్టు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయి. సమావేశంలో పలు సంఘాల నాయకులు నడిపినేని వెంకట్రావు, హైమారావు, బసవలింగరావు, రవిచంద్ర., శ్రీనివాసరావు, రామకృష్ణ, విజయకుమార్, శ్రీను, శ్రీనివాసులు, తులసీ విష్ణుప్రసాదు, మేకల రవీంద్రబాబు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులకు హిందీ ఉపాధ్యాయ సంఘం మద్దతు

గుంటూరు(విద్య), జనవరి 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న కూటమి అభ్యర్థులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరా బత్తుల రాజశేఖర్‌లకు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు హిందీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు వని మిరెడ్డి విజయ్‌కుమార్, మేడికొండ సదానందబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల విజయం కోసం తమవంతు కృషి చేస్తామని సంఘం నాయకులు తాటి నరేష్‌కుమార్ పులి భాస్కరరావు తదితరులు పేర్కొన్నారు.

ఆక్రమణలను వెంటనే తొలగించాలి : కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ ఆర్‌వోబీ నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని, నిర్మాణ పనుల వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా అరండల్‌పేట, బ్రాడీపేటల్లో రోడ్ల మీద ఆక్రమణలను యుద్ధ ప్రాతిపది న తొలగించడానికి, ఆయా ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులను చేపట్టడానికి చర్యలు తీసు కోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక, ఇంజ నీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం అరండల్‌పేట 1వ లైన్, బ్రాడీపేట 1, 4వ లైన్లు, లాడ్జి సెంటర్ నుంచి బ్రాడిపేట వైపుగా కంకరగుంట ఆర్‌యూబీకి వచ్చే మార్గం, డొంక రోడ్డు తదితర ప్రాంతాల్లో జీఎంసీ పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యటించి తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్‌బాబు, ఏసీపీలు తదితరులున్నారు.

బుడమేరు బాధితులకు అండగా ఉండాలని సూచించాను

- మేయర్ మనోహర్ నాయుడు



గుంటూరు కార్పొరేషన్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): బుడమేరు వరదల సమయంలో అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు సహాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో, కమిషనర్ తమ దృష్టికి తీసుకురాగా వరద బాధితులకు అండగా ఉండాలని కమిషనర్‌కి తానే సూచించానన్నారు. బుధవారం కార్పొరేషన్‌లో మేయర్ ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం నగరపాలక సంస్థ వెచ్చించిన 9.24 కోట్ల నిధులపై కౌన్సిల్ సమావేశంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కమిషనర్ సరైన సమాధానం ఇవ్వకుండా, సభ నుంచి వాకౌట్ చేశారన్నారు. నగరపాలక సంస్థలో జరిగిన ఈ అవినీతిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ఫిర్యాదు చేశామని, దీనిపై సీఎం, డిప్యూటీ సీఎం స్పందిస్తారని ఆశిస్తున్నామన్నారు. గత నెల 20న కౌన్సిల్ సమావేశం జరిగిందని, అప్పటి నుంచి ఖర్చుల వివరాలు వెల్లడించాలని కమిషనర్‌ను అడిగినప్పటికీ ఆయన స్పందించట్లేదన్నారు. 9.24 కోట్ల నిధులు కమిషనర్ అనధికారుల ఖాతాల్లోకి జమయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ ఘటనపై భవిష్యత్తులో న్యాయపోరాటం చేయడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యురాలిగా ఎన్నికకు నామినేషన్

గుంటూరు నగరపాలక సంస్థ స్థాయి సంఘ (స్టాండింగ్ కమిటీ) ఎన్నికకు బుధవారం 6వ వార్డ్ కార్పొరేటర్ పి.సమత నామినేషన్ దాఖలు చేశారని స్టాండింగ్ కమిటి ఎన్నికల అధికారి చల్లా ఓబులేసు తెలిపారు. అదనపు కమిషనర్ మాట్లాడుతూ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు ఈ నెల 16న నోటిఫికేషన్ ఇచ్చామని, ఫిబ్రవరి 3న ఎన్నిక జరుగుతుందని తెలిపారు. 22 నుంచి 24 వరకు నామినేషన్లు దాఖలు చేయడానికి గడువు ఉందని, తొలి రోజు బుధవారం 6వ వార్డు కార్పొరేటర్ పి.సమత నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని తెలిపారు. నామినే షన్ల స్వీకరణకు అదనపు కమిషనర్ చాంబర్లో సిబ్బందిని కేటాయించామని, ఉద యం 11 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చన్నారు.

కబరస్తాన్‌కు రెండో గేటుపై వివాదం

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సంగడిగుంటలోని కబరస్తాన్‌కు రెండో గేట్ ఏర్పాటు విషయం వివాదాస్పదమైంది. ఇప్పటికే కబరస్తాన్‌కు ఉన్న ఒక గేటు ఇరుకుగా ఉంది. దీంతో మరో వైపు రెండో గేటు పెట్టుకునేందుకు నిర్వాహకులు గోడ కొంత మేర పగలగొట్టారు. అయితే మా ఇళ్ళవైపు గేటు ఎలా పెడతారని స్థానికులు నిలదీశారు. దీంతో ఈ విషయం వివాదాస్పదమైంది. కొత్తగా గేట్ ఏర్పాటుకు స్థానికులు అంగీకరించలేదు. అక్కడ మరో గేటు పెడితే మృతదేహాలు మా ఇళ్ళవైపు నుంచి తీసుకువెళతారంటూ వారు నిరసనకు దిగారు. గేటు పెట్టాల్సిందేనంటూ మరో వర్గం అక్కడకు చేరుకుంది. ఇరువర్గాలు అక్కడ కు రావడంతో కొంత ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. సమాచారం అందుకున్న తహసీల్దార్, పోలీసులు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కూడా రంగంలోకి దిగి ఇరువర్గాలతో చర్చించారు. గోడను గురువారంలోగా తిరిగి నిర్మించే విధంగా ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో వివాదం సర్దుమణిగింది.

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

కాకుమాను, జనవరి 22(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందాలన్నదే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. కాకుమాను విష్ణాలయ మండపంలో బుధవారం మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మూడు నెలలకొకసారి అధికారులతో సమీక్ష నిర్వహిస్తానన్నారు. సమీక్షలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల అర్జీలను రికార్డు చేసి సమీక్ష నాటికి నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కారం చేయాలని అధికారులకు సూచించారు. అట్టడుగు స్థాయిలో ఉన్న వారిని గుర్తించి వారికి కూడా సంక్షేమ ఫలాలు అందిచాల్సిన బాధ్యత ప్రజా ప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రజాప్రతినిధులు, అధికారులు రెండు కళ్లని చెప్పారు. అధికారులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. సచివాలయ ఉద్యోగులు సమన్వయంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ కన్వీనర్ కొర్రపాటి నాగేశ్వరరావు, టీడీపీ సీనియర్ నాయకులు కొల్లా వీరయ్య చౌదరి, మామిళ్లపల్లి రాంగోపాల్, నక్కల అగస్టీన్, మాణిక్యరావు, పూర్ణచంద్రరావు, ఎమ్మార్వో వెంకటస్వామి, ఎంపీడీవో యుగకీర్తి, ఏఈలు, ఏపీవో, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై ఆగ్రహం

మండల స్థాయి సమీక్షలో కల్యాణ మండపం పక్కనే ఉన్న మందిరంలో గ్రామాల వారీగా మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులతో కలసి ప్రజల నుంచి నేరుగా అర్జీలను ఎమ్మెల్యే తీసుకున్నారు. కొమ్మూరులో గ్రామ పంచాయతీ కార్యదర్శిపై పజలు ఫిర్యాదు చేయగా వెంటనే డీపీవోకు సరెండర్ చేయాలని ఎంపీడీవో యుగకీర్తి, ఈవోపీఆర్డీ రవీంద్రబాబులను ఆదేశించారు. అలాగే గరికపాడు ప్రజలు రైతు సేవాకేంద్రం ద్వారా ధాన్యం కొనుగోలు చేయడం లేదని, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తుంటే ఏవో కిరణ్మయి చర్యలు తీసుకోవడం లేదని ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన ఏవోపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదనందిపాడు మండలం జీజీ పాలెంకు చెందిన ఒక వ్యక్తి ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి డబ్బులు తీసుకుని ప్రజలను మోసం చేస్తున్నారని చెప్పగా వారిపై కేసు నమోదు చేయాలని ఎస్ఐని ఆదేశించారు.

ఘనంగా చలపతి ఆంజనేయులు పుట్టినరోజు వేడుకలు



వైవీ ఆంజనేయులుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, అధ్యాపకులు, సిబ్బంది

తాడికొండ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చలపతి విద్యాసంస్థల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు 67వ పుట్టిన రోజు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. లాం చలపతి ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాల, మోతడక చలపతి ఫార్మసీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల సమక్షంలో కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సి పాల్ నాదెండ్ల రామారావు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం చంద్రశేఖర్, మోతడక ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ కే నాగ శ్రీనివాసరావులు పుష్ప గుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఫార్మసీ కళాశాలలో 100 శాతం హాజరు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాల ను అందజేశారు. ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబి రంలో 100 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. మోతడక ఇంజనీరింగ్ కళా శాలలో రెయిన్ బో బ్లడ్ బ్యాంక్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కళాశాలలో వివిధ అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, అధ్యాపకులకు జ్ఞాపికలు బహూకరించారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ వై సుజిత్‌కుమార్, కోశాధికారి వై అనంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు చేరిన నెల్లూరు, గుంటూరు జట్లు



గెలిచిన జట్టు సభ్యులు

మంగళగిరి సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళగిరి అంతర్జాతీ య క్రికెట్ మైదానంలో జరుగుతున్న ప్రీమియర్ లీగ్ పోటీల్లో భాగంగా బుధవారం రెండు సెమీఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. నెల్లూరు - కడప జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 167 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 2 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. 36 బంతుల్లో 78 పరుగులు చేసిన సోహాన్ వర్మ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. గుంటూరు -విజయనగ రం జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్ రసవత్తంగా సాగింది. మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్ ద్వారా ఫలితం తేల్చారు. సూపర్ ఓవర్‌లో గుంటూరు జట్టు 28 పరుగుల తేడాతో విజయనగరం జట్టుపై గెలుపొందింది. కేపీ సాయి రాహుల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు. ఫైనల్ చేరిన గుంటూరు, నెల్లూరు జట్ల మధ్య గురువారం ఉదయం 9:30 గంటలకు టైటిల్ పోరు జరుగనుంది.

రోడ్డు భద్రతా నియమాలను పాటించాలి : డీఎస్పీ

మంగళగిరి సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని ఆర్టీవో బి. సత్యనారాయణ ప్రసాద్ కోరారు. రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళగిరి మోటారు వాహనాల తనిఖీ కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం కళాశాలల విద్యార్థులతో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆర్టీవో సత్యనారాయణ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపవద్దని, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలని, పరిమితికి మించి వేగంగా వాహనాలను నడుపవద్దని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, మోటారు వాహనాల తనిఖీ అధికారులు పీ పవన్‌కుమార్, అర్బన్ సీఐ వినోద్‌కుమార్, ఎస్ఐ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి

● డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ కే సత్యనారాయణ

తాడికొండ(లాం), జనవరి 22(ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను సద్విని యోగించుకోవాలని గుంటూరు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ కే సత్యనారాయణ తెలిపారు. బుధవారం లాంలో పశు ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ఆరోగ్య శిబిరంలో అనారోగ్య పశువులకు, దూడలకు నట్టల నివారణ చేపట్టి మందులు ఉచితంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో లాం సర్పంచ్ అబిదా అలీ, పొన్నెకల్లు పశువైద్యాధికారి డాక్టర్ ఆర్ సౌజన్య, లాం పశువైద్యశాల లైవ్ స్టాక్ ఆఫీసర్ సేవానాయక్, టీడీపీ నాయకులు కొల్లికొండ వెంకట్, వెంగళశెట్టి సత్యనారాయణ, సిబ్బంది వినోద్, బాజీ తదితరులు పాల్గొన్నారు.


● **పెదనందిపాడు (ఆంధ్రజ్యోతి):** మండలపరిధిలోని పాలపర్రు, పమిడివారిపాలెం గ్రామాల్లో జాతీయ పశువ్యాధి నిర్ధారణ పథకం వారి సౌజ్యంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ వైద్యశిబిరాలను ఏడీఏ ప్రారంభించారు. పమిడివారిపాలెంలో 331 మేకలు, గొర్రెలు, గేదెలకు, పాలపర్రుల్లో 931 మేకలు, గొర్రెలు, గేదెలకు వైద్యులు స్వాతి, విమలలు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● **వట్టిచెరుకూరు(కోవెలమూడి):** మండలంలోని కోవెలమూడిలో వట్టిచెరుకూరు పశు వైద్యాధికారి కే కోటేశ్వరమ్మ, వైద్యులు, సిబ్బంది బృందం చమళ్ళమూడిలో కాట్రపాడు పశు వైద్యాధికారి డాక్టర్ భవ్య శాంతి, ఇతర డాక్టర్లు, సిబ్బంది బృందం వైద్యశిబిరాల్లో పాల్గొని పశువులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

కౌలు రైతు మిత్ర గ్రూపులకు రుణాలు

● లీడ్ బ్యాంక్ మేనేజర్

ఫిరంగిపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు రైతు మిత్ర గ్రూపుల ద్వారా గాని, జాయింట్ లయబిలిటీ గ్రూపులుగా ఏర్పడి ఆరు నెలలు పొదుపు చేసుకుంటే పెట్టుబడి సాయంగా లక్ష రూపాయల వరకు రుణం మంజూరు చేస్తామని గుంటూరు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పొనుగుపాడులో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులు, గ్రూపులుగా తీసుకున్న, వ్యక్తిగతంగా తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించే వారికి బ్యాంకుల హితోధికంగా సహకారం అందిస్తాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కూడా ప్రభుత్వం అందించే రుణాలు రాయితీ పోను మిగతా రుణాన్ని సకాలంలో చెల్లించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పొనుగుపాడు యూనియన్ బ్యాంకు అధికారులు, ఏవో, రైతులు పాల్గొన్నారు.


భావితరాల భవిష్యత్తుకు ఆశాజ్యోతి
యువనాయకుడు, అవిశ్రాంత పోరాట యోధుడు
రాష్ట్ర మంత్రివర్యులు
గౌ॥ శ్రీ నారా లోకేష్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు...
మీ
కనపర్తి శ్రీనివాసరావు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి
మరియు అవనిగడ్డ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు



పారి స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు ఉత్తమ అవార్డు

మంగళగిరి సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బిజినెస్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషనల్‌లో సృజనాత్మక పద్ధతులను అనుసరిస్తున్న ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీలోని పారి స్కూల్ ఆఫ్ బిజినెస్‌కు జాతీయ స్థాయిలో ఉత్త మ బిజినెస్ స్కూల్ అవార్డు లభించింది. పారి స్కూల్‌ను 2024 సంవత్సరానికి గాను ఉత్తమ బిజినెస్ స్కూల్‌గా ఎంపిక చేసినట్టు అకడమిక్స్ ఇన్ సైట్స్ మేగజైన్ పేర్కొంది. ఈ నెల 18న బెంగళూరులో జరిగిన మేగజైన్ ఎక్స్‌లెన్స్ అవార్డుల ప్రదానోత్సవంలో ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ పంకజ్ బల్వేరియా, పారి స్కూల్ డైరెక్టర్ ధర్మతేజలు నిర్వాహకుల చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రాంగణంలో మూడేళ్ల కింద ప్రారంభమైన పారి బిజినెస్ స్కూల్ ఎంబీఏ, బీబీఏ కోర్సులను అందిస్తూ పాఠ్య ప్రణాళికా రూపకల్పన, విశేష అనుభవం ఉన్న అధ్యాపకుల ద్వారా నాణ్యమైన విద్యాబోధన కొనసాగిస్తుంది. దీనిని గుర్తించిన అవుట్‌లుక్ మేగజైన్ గతంలో దక్షిణ భారత దేశంలోనే ఎమర్జింగ్ బిజినెస్ స్కూల్ గాను, బెస్ట్ ఎమర్జింగ్ స్కూల్‌గాను, కెరీర్ 360 వెబ్‌సైట్ ఇండియాస్ బెస్ట్ బిజినెస్ స్కూల్‌గాను గుర్తించింది. పారి స్కూల్‌కు ఉత్తమ అవార్డు లభించడంపై ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్, వైస్‌చాన్సలర్ డాక్టర్ మనోజ్‌కుమార్ అరోరా, స్కూల్ డీన్ డాక్టర్ భరద్వాజ్ అభినందనలు తెలియజేశారు.


అవార్డు అందుకుంటున్న పారి స్కూల్ ప్రోగ్రాం డైరెక్టర్ ధర్మతేజ

రేపు ఏడీ కార్యాలయాల వద్ద ధర్నాలు

మంగళగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 24వ తేదీన ఏడీ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహిస్తున్నట్టు ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ బాలకృష్ణ తెలిపారు. వ్యవసాయం తరువాత చేనేత ప్రధానమని చెబుతున్న పాలకులు బడ్జెట్‌లో చేనేతకు నిధులు కేటాయించకపోవడం అన్యాయమన్నారు. చేనేతకు తక్షణమే బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నేతన్న నేస్తం అమలు చేయాలని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలని, చేనేతపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలని, కార్మికులకు మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలని, 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాల్లో నేత కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



మందుబాబులకు రూ.10వేల జరిమానా

మంగళగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడుతున్న ఇద్దరు మందుబాబులను మంగళగిరి సీఐ వినోద్‌కుమార్, సిబ్బంది బుధవారం అదుపులోకి తీసుకున్నారు. వారిని మంగళగిరి ఏజేసీజే కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి కే సురేష్‌బాబు మందుబాబులు షేక్ అన్వర్ బాషా, ఆకురాతి బాలాజీలకు చెరో రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

యువత బాధ్యతగా వ్యవహరించాలి

దుగ్గిరాల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని యువజన సర్వీసుల శాఖ జిల్లా మేనేజర్ రాధిక అన్నారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాలతో చింతలపూడిలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఈవ్‌టీజింగ్, సైబర్‌నేరాలు, మాదకద్రవ్యాలు, సోషల్ మీడియా క్రైమ్స్‌పై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్ శివ సుబ్రహ్మణ్యం, ఇంజనీరింగ్ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు.










శ్రీ నారా లోకేష్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
Happy Birthday
తాతయ్య గారి స్ఫూర్తితో,
తండ్రి గారి అడుగుజాడల్లో,
3వ తరం నాయకుడిగా....
తెలుగు నేల పై
నవ్యాంధ్రప్రదేశ్ భవిష్యత్ కోసం,
భావితరాల అభ్యున్నతి కొరకు...
ఆత్మవిశ్వాసమే ఆయుధంగా మలుచుకొని...
ప్రతి ఒక్కరికి భవిష్యత్తుకు భరోసానిస్తూ
ముందుకు సాగుతున్న ఆంధ్రప్రదేశ్
రాష్ట్ర ఐటి, ఎలక్ట్రానిక్స్ & కమ్యూనికేషన్స్,
మానవనరులు, విద్యాశాఖామాత్యులు
శ్రీ నారా లోకేష్ గారికి
నా హృదయపూర్వక జన్మదిన
శుభాకాంక్షలు.
కళ్ళం రాజశేఖర్‌రెడ్డి
B.Tech (Computer Science)
గుంటూరు జిల్లా తెలుగు రైతు అధ్యక్షులు, పెనుమాక
కొమ్మారెడ్డి కిరణ్
తెలుగుదేశం పార్టీ నాయకులు, మంగళగిరి



టిడ్కోలో ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు

● చిన్నారులకు విద్యా కానుక కిట్ల పంపిణీ

మంగళగిరి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పీఎం ఏవై-ఎన్టీఆర్ నగర్ టిడ్కో సముదాయంలో బుధవారం రాత్రి మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య, టీటీడీ ధర్మకర్త తమ్మిశెట్టి జానకీదేవి, టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు పాల్గొని కేకు కట్ చేశారు. 500 మంది చిన్నారులకు నోటుపుస్తకాలు, స్టేషనరీ వస్తువులతో కూడిన విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు తోట పార్థసారథి, బోగి వినోద్, కారంపూడి అంకమ్మరావు, సంకా బాలాజీగుప్తా, జొన్నాదుల బాలకృష్ణ, అబ్దుల్ మజీద్, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, తాడిబోయిన మహేష్, పడవల మహేష్, షేక్ ఫిరోజ్, వాకా మాధవరావు, తుమ్మా మోహనరంగా తదితరులు పాల్గొన్నారు.


చిన్నారులకు విద్యా కానుక కిట్లు పంపిణీ చేస్తున్న నేతలు

నృసింహుడికి వెండి కిరీటం సమర్పణ

మంగళగిరి సిటీ, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామికి దాతలు వెండి కిరీటాన్ని సమర్పించారు. హైదరాబాద్ కు చెందిన కే అన్నపూర్ణ జ్ఞాపకార్థం భర్త రామారావు, కుమారులు మధుసూదనరావు, రవికిరణ్ లు కిలో 340 గ్రాముల బరువు గల వెండితో కిరీటాన్ని తయారు చేయించి 3గ్రాముల బంగారంతో తాపడం చేయించారు. స్వామి వారి అలంకరణ నిమిత్తం ఈ కిరీటాన్ని దాతల కుటుంబసభ్యులు బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డికి అందజేశారు.


వెండి కిరీటాన్ని ఈవోకు అందజేస్తున్న దాతలు

థాయ్‌లాండ్ యూనివర్సిటీతో కేఎల్‌యూ ఒప్పందం

తాడేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): థాయ్‌లాండ్‌కు చెందిన స్కూల్ ఆఫ్ రెన్యువబుల్ ఎనర్జీ మైజో యూనివర్సిటితో కేఎల్ డీమ్డ్ యూనివర్సిటిలోని వ్యవసాయ కళా శాల అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కేఎల్‌యూ వైస్ చాన్స్‌లర్ సారధివర్మ తెలిపారు. ఉద్యోగుల మార్పు వ్యవసాయ పరిశోధనల్లో భాగస్వామ్యం విద్యార్థులకు ఉమ్మడి ఇంటర్న్ షిప్‌లను కల్పించడంతోపాటు కృత్రిమ వ్యవసాయంలో పెనుమార్పులకు శ్రీకారం చుట్టడానికి ఈ అవగాహన ఒప్పందం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. రానున్న కాలంలో ఏఐ టెక్నాలజీ సాయంతో వ్యవసాయరంగంలో పెనుమార్పులకు రంగం సిద్ధమవుతుందన్నారు. ఈ ఒప్పందాలపై కేఎల్‌యూ రిజిస్ట్రార్ సుబ్బారావుతోపాటు మైజో యూనివర్సిటి ప్రతినిధులు సంతకాలు చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో వీసీ సారధివర్మతోపాటు ప్రోవీసీలు, వ్యవసాయ కళాశాల డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మూడు గ్రామాలలో సీఆర్డీఏ స్పెషల్ డ్రైవ్

తుళ్లూరు, జనవరి 22(ఆంధ్రజ్యోతి): రాజధాని గ్రామాలైన లింగాయపాలెం, ఉద్దండ్రాయునిపాలెం, మల్కాపురం రెవెన్యూలలో గురువారం సీఆర్డీఏ స్పెషల్ డ్రైవ్ నిర్వహించనుంది. సీఆర్డీఏ భూములు ఆక్రమించి ఫైర్లు వేసిన వాటిని తొలగించనుంది. ఇంతకు ముందే పంటలు వేయవద్దని తెలిపింది. అయినా కానీ కొంత మంది ఫైర్లు వేయటానికి ఉపక్రమించటంతో తొలగింపు చర్యలు చేపట్టాలని సీఆర్డీఏ నిర్ణయించింది. రాజధాని పనులు ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభం కానున్నాయి. వాటికి అడ్డంకిగా పంటలు మారే అవకాశం ఉన్న నేపథ్యంలో తొలగింపు తప్పనిసరైందని అధికారులు పేర్కొంటున్నారు. ఈ మేరకు మూడు గ్రామాల యూనిట్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సాయి శ్రీనివాస్ నాయక్ తుళ్లూరు పోలీసుస్టేషన్‌కు బందోబస్తు కోసం బుధవారం లేఖ రాశారు.













బాలికల విశ్రాంతి భవనం పరిశీలన

పెదనందిపాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీఏఎస్ కళాశాలలో నూతనంగా నిర్మిస్తున్న బాలికల విశ్రాంత భవనాన్ని బుధవారం డీఎల్‌డీవో పిచ్చిరెడ్డి పరిశీలించారు. ఎంపీ వై సుజనాచౌదరి రు.25లక్షల ఎంపీ నిధులు, దాతల విరాళాలు రు.28.50లక్షలతో 70శాతం మాత్రమే పనులు పూర్తిచేసి, పనులను నత్తనకడకన సాగుతుండడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులను పరిశీలించి, కమిటీ సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. దీనిపై నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులు అందజేస్తామని తెలిపారు. ఆయనతోపాటు కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ఉన్నారు.

నేడు చిగురు ఆశ్రమంలో అన్నదానం

తాడేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని 11 గంటలకు గురువారం ఉదయం ఉండవల్లి కరకట్ట చిగురు ఆశ్రమంలో కేక్ కటింగ్, అన్నదానం జరుగుతుందని మండల తెలుగుయువత నాయకులు కొల్లి సురేష్ తెలిపారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలి

● పాలిటెక్నిక్ కళాశాల జాయింట్ సెక్రటరీ

తాడేపల్లి, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో పోటీతత్వం పెరగాలని కేఈఎస్ పాలిటెక్నిక్ కళాశాల జాయింట్ సెక్రటరీ పార్థసారధి అన్నారు. వడ్డేశ్వరంలోని కేఈఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతూ 3వ సెమిస్టర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని, అప్పుడే తాము ఎంచుకున్న రంగంలో రాణిస్తారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

నేటి నుంచి అందుబాటులోకి మెప్మా అర్బన్ మార్కెట్

● మున్సిపల్ కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి మెప్మా అర్బన్ మార్కెట్ అందుబాటులో ఉంటుందని ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో గురువారం నుంచి పురపాలక సంఘ మెప్మా అధికారుల ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో రెండు రోజులు మెప్మా అర్బన్ మార్కెట్‌ను నిర్వహిస్తామని కమిషనర్ పేర్కొన్నారు.



ఉరి వేసుకొని ఆటోడ్రైవర్ మృతి

తెనాలి, మారీసుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక ఆర్ఆర్ నగర్ చెందిన ఆనం దుర్గాప్రసాద్ (32) భార్య, పిల్లలు, తండ్రితో కలసి నివాసం ఉంటున్నాడు. ఆటో నడుపుతూ వచ్చిన ఆదాయంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఇద్దరు సంతానాన్ని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదివిస్తున్నాడు. భార్య వేజండ్లలోని ఓ స్పిన్నింగ్ మిల్‌లో కూలీగా పనిచేస్తోంది. బుధవారం ఇద్దరు పిల్లలను దుర్గాప్రసాద్ తండ్రి స్కూల్‌లో దించేందుకు వెళ్లగా, భార్య స్పినింగ్ మిల్‌లో పనికి వెళ్లింది. ఈ క్రమంలోనే ఒంటరిగా ఉన్న దుర్గాప్రసాద్ మద్రాస్‌లో ఉన్న బాబాయికి తాను చనిపోతున్నాని తన చావుకు స్కూల్ టీచర్, మరో ముగ్గురు కారణమని మెసేజ్ పెట్టి ఇంట్లో ఉరి వేసుకున్నాడు. బాబాయి మృతుడు పంపిన సందేశాన్ని చూసి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వగా కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లేసరికి నైలాన్ తాడుకు వేళాడుతూ దుర్గాప్రసాద్ మృతి చెంది ఉన్నాడు. దీనిపై మృతిని భార్య లక్ష్మీగంగ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

తెనాలి, మారీసుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. స్థానిక యడ్లలింగయ్య కాలనీకి చెందిన ఓ బాలిక పట్టణంలోని ఒక కళాశాలలో ఇంటర్ చదువుతోంది. బుధవారం కాలేజికి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లి రాత్రయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై ...

తెనాలి, మారీసుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ప్రతాప్ కుమార్ తెలిపారు. మండలంలోని ఖాజీపేటకు చెందిన హోటల్ నిర్వాహకుడు పసుపులేటి విజయ కుమార్ (59) ఈ నెల 20న బయటకు వెళ్లి వస్తానంటూ కుటుంబ సభ్యులకు చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులను విచారించినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

కొల్లిపర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో బుధవారం జూదరులపై దాడులు నిర్వహించగా మున్నంగి గ్రామంలో ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం మున్నంగిలో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావటంతో దాడులు చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.13వేల900లను సీజ్‌చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలియజేశారు.

అత్యధిక మెజార్టీతో ఆలపాటిని గెలిపించుకుందాం

● పట్టణ టీడీపీ అధ్యక్షుడు హరిప్రసాద్

తెనాలి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, కృష్ణ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులందరూ సమష్టిగా కృషి చేయాలని పట్టణ టీడీపీ అధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్ చెప్పారు. బుధవారం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి పార్టీ శ్రేణులతో, ఎమ్మెల్సీ ఎలక్షన్స్ బూత్ ఇన్చార్జులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతి ఒక్కరూ ప్రచారాన్ని ముమ్మరం చేయాలన్నారు. ఆలపాటి నియోజకవర్గంలో ప్రజలకు చేసిన మంచిని వివరిస్తూ పెద్దల సభలో ఆయన ఆవశ్యకతను పట్టభద్రులకు తెలిపి ఓటును అభ్యర్థించాలని సూచించారు. కార్యక్రమంలో మహ్మద్ ఖుద్దూస్, జొన్నాదుల మహేష్, వసంతం అశోకవర్ధన, మల్లవరపు విజయ్‌కుమార్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సంగంజాగర్లమూడిలో బేటీ బచావో బేటీ పడావో

తెనాలి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంగంజాగర్లమూడి హైస్కూల్‌లో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగంలోని రైల్వేచైల్డ్ హెల్ప్‌లైన్ సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆడపిల్లల హక్కులు, రక్షణ చట్టాలు, బాల్య వివాహ నిర్మూలన వంటివాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్కూల్ హెచ్ఎం శివరామకృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైల్వే చైల్డ్ హెల్ప్ లైన్ గుంటూరు టీమ్ మెంబరు వాకా లక్ష్మణ్‌నందన్, అంగన్‌వాడీ టీచర్లు శివపార్వతి, లక్ష్మి, నాగలక్ష్మి, అనూరాధ, శివమ్మ, లక్ష్మీతిరుపతమ్మ, స్కూల్ టీచర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మారుతున్న పట్టణ రూపురేఖలు

● రహదారుల విస్తరణపై మంత్రి మనోహర్ దృష్టి
● సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి


సువిశాలంగా మారిన శివాజీ చౌక్

తెనాలి అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో కొన్ని ప్రాంతాల రూపురేఖలు మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సంక్షేమంతో పాటు అభివృద్ధిపై కూడా దృష్టి సారించడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ సమస్యలు నివారించడంతో పాటు రహదారులు విస్తరించి ప్రజల సౌకర్యాలను మెరుగుపరిచే పనిలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నిమగ్నమయ్యారు. ఇప్పటికే బోసురోడ్డులోని స్వరాజ్ టాకీసు సెంటర్ నుంచి కాకుమాను సత్రం వరకు రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో పాటే శివాజీ చౌక్ నుంచి రైతుబజారు వరకు ఇరువైపులా రహదారి విస్తరణ, అభివృద్ధి చేపట్టారు. ఈ మార్గం బుర్రిపాలెం, అనంతవరం, చిలుమూరు వరకు వెళుతుంది. పట్టణంలోని ప్రకాశం రోడ్డు నుంచి నెహ్రూరోడ్డు, శివాజీ చౌక్ మీదుగా చిలుమూరు వరకు వాహనాలు వెళ్లాల్సిన ఏకైక మార్గం కూడా ఇదే కావడంతో ఆక్రమణలు కారణంగా నానా ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో ప్రజల రాకపోకలకు కూడా ఇక్కడ తగినంత స్థలం ఉండి కూడా సతమతమవుతున్నారు. మురుగు కాల్వలు దాటి శివాజీచౌక్ ఇరువైపులా 15 అడుగుల మేరకు చేసిన ఆక్రమణలన్నింటిని తొలగించడంతో ఈ ప్రాంతం సువిశాలంగా మారింది. సైడు కాల్వల వరకు రహదారి విస్తరించి రాకపోకలకు మళ్లీ ఆక్రమణలు లేకుండా చూసేందుకు మున్సిపల్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఈ ప్రాంతం పట్టణానికి శోభ తీసుకురానుంది. బోసురోడ్డు విస్తరణ పనులు కూడా చేయడంతో ట్రాఫిక్ సమస్య చాలావరకు పరిష్కారం అవుతుందని భావిస్తున్నారు. సైడ్ డ్రెయిన్స్ వరకు మార్జిన్‌లలో మెరకలను తొలగించి రహదారి విస్తరించడంతో వాన నీరు కూడా కాల్వల్లోకి చేరి పారేందుకు మార్గం సుగమం అవుతుంది. దుకాణాల ముందు మెట్ల పేరుతో కాల్వల్లోకి వాన నీరు చేరకుండా నిర్మాణాలు చేయకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. ఈ రహదారుల విస్తరణతో పాటు పట్టణంలో కీలకమైన రెండు పార్కుల అభివృద్ధికి కూడా శ్రీకారం చుట్టారు. చినరావూరు పార్కును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వీఎస్ఆర్ కళాశాల వద్ద చేపట్టిన ఫైకస్ పార్కును పూర్తి చేసేందుకు నిధులు కేటాయించారు. ఈ పార్కు పూర్తయితే పట్టణంలో మరో ఆహ్లాదకరమైన ప్రదేశం రూపుదిద్దుకుంటుంది. బుర్రిపాలెం రోడ్డులో 1.70 ఎకరాలలో సుమారు రూ.3కోట్లతో పట్టణ ప్రజల కోసం క్రీడా ప్రాంగణంగా తీర్చిదిద్దేందుకు స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారు. విజయవాడ రహదారి ప్యాచ్ వర్క్ పనులతో పాటు గ్రామీణ ప్రాంత రహదారులను రూ.25 కోట్లతో చక్కదిద్దనున్నారు.




బుర్రిపాలెం రోడ్డులో తొలగించిన ఆక్రమణలు, జరుగుతున్న విస్తరణ పనులు

ప్రజల భాగస్వామ్యంతోనే పట్టణాభివృద్ధి సాధ్యం

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణ సుందరీకరణ, అభివృద్ధి ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమౌతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. బుధవారం పురపాలక సంఘ పరిధిలోని 32, 11వ వార్డు పూలే కాలనీలో అభివృద్ధి పనులలో భాగంగా సీసీ, బీటీ రోడ్లు, నూతన డ్రెయిన్‌ల నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నతో కలసి భూమి పూజలను నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు పట్టణ సుందరీకణలో భాగంగా ఆరు డ్రెయిన్లు రెండు రోడ్లకు రూ.51.79 లక్షలతో, 11వ వార్డులో రూ.16లక్షలతో 160 మీటర్ల రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. ప్రజలు సహకరించి సుందర తెనాలిలో భాగస్వామ్యులు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఆకుల శ్రీనివాసరావు, ఏఈ సునీల్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ షేక్ గౌస్, ఎం.రాజేశ్వరావు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించండి

తెనాలి, మారీసుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): డ్రెయిన్లు మురుగు కాలువలలోని వ్యర్థాలను పూర్తిగా తొలగించి మురుగునీరు సక్రమంగా పారేట్లు చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక శానిటేషన్ సిబ్బందికి సూచించారు. బుధవారం పురపాలక సంఘ పరిధిలోని 24వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక క్షేత్రస్థాయిలో అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రజలు వ్యర్థాలను మురుగు కాలువలో వేయరాదన్నారు. ఇంటివద్దనే చెత్తను పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పెదలంక లక్ష్మీలావణ్య, కోఅప్షన్ మెంబర్ జీ నిర్మలాదేవి, డీఈ సుబ్బారావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, టీపీవో సాంబశివరావు, ఏఈ సునీల్ కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు భూమి పూజలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న తదితరులు

ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తగ్గుతుంది

● మహారాష్ట్ర వ్యవసాయ అధికారుల బృందం


మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

తెనాలి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ పద్ధతులలో పంటల సాగుకు పెట్టుబడులు తగ్గి ఆర్థికంగా ఆరోగ్యపరంగా మేలుగా ఉందని మహారాష్ట్ర వ్యవసాయ అధికారుల బృందం సభ్యులు చెప్పారు. బుధవారం తెనాలి మండలం ఎరుకలపూడి, కొల్లిపర మండలం అత్తోట గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను అధికారులతో కలిసి బృంద సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరుకల పూడిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండిస్తున్న మొక్కజొన్న పంటలను, ఎరువులు, పురుగు మందులు వాడుతూ సాగులో ఉన్న మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించారు. ప్రకృతి వ్యవసాయంలో వాడే ఎండిన ఆవ, గేదెల పేడ, ఆకు, తుక్కు ద్వారా తయారుచేసే కంపోస్టు, వేప పిండి వంటి పదార్థాలతో సాగుకు వాడే మిశ్రమం వంటి వాటిపై రైతులు విజయలక్ష్మి, రంగయ్యలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ ఆహార ఉత్పత్తిదారుల సంఘాన్ని సందర్శించి మీసాల రామకృష్ణ అనుభవాలను తెలుసుకున్నారు. కొల్లిపర మండలంలోని నామిని రోశయ్య బహుళ పంటల క్షేత్రాన్ని సందర్శించి భూమి భారతిలోని వివిధ రకాల దేశవాళి రకాల విత్తనాలను గురించి తెలుసుకుని మార్కెటింగ్ విధానాన్ని ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా అక్కడ జరుగుతున్న కార్యక్రమాల్ని అత్తోట రైతులతో మాట్లాడి బాపయ్య అనుభవాలు తెలుసుకున్నారు. ఈఎస్‌పీఎం షాపులో ఉన్న వివిధ రకాల కషాయాల వివరాలు తెలుసుకుని వారిని అభినందించారు. అండర్ 14-ఏ సెక్రటరీ ముంబై మంత్రాలయ్ పి.ప్రశాంత్, దత్తాత్రేయ, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ పూనే గవసానే, ధరశివ్ డిస్ట్రిక్ సూపరింటెండెంట్ ఆఫ్ అగ్రికల్చర్ రవీంద్రమణి, సీనియర్ కన్సల్‌టెంట్ సలీల్‌కుమార్, కన్సల్‌టెంట్ నేహపటేల్, డీడీఏ ఆర్ఎస్‌కే డి.వెంకటేశ్వర్లు, ఏడీఏ ఆర్ఎస్‌కే శీనివాసరావు, ఏవో శివప్రసాద్, ప్రకృతి వ్యవసాయ డీపీఎం రాజకుమారి, ఏవో ప్రేమసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలకు 15 రోజుల్లో అనుమతులివ్వాలి

● కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశం

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులను 15 రోజుల్లోపు సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు పూర్తిచేసి జిల్లా స్థాయి ఇసుక కమిటీ అమోదానికి ప్రతిపాదనలు అందించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా సత్వరమే ఇసుకను అందించేందుకు నిబంధనల ప్రకారం ఇసుక తవ్వకాల అనుమతుల మంజూరుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో 17 ఎకరాల పట్టా భూముల్లో, 4.93 హెక్టార్ల ప్రభుత్వ భూముల్లో ఇసుక తవ్వకాలకు చేసుకున్న దరఖాస్తులను కమిటీలో అమోదించారు. వీటికి సంబంధించి పర్యావరణ అనుమతులు వచ్చిన వెంటనే తవ్వకాలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా 70 ఎకరాల్లో ఇసుక తవ్వకాల కోసం వచ్చిన దరఖాస్తులను నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం సకాలంలో పరిష్కరించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఏ భార్గవతేజ, జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, మైన్స్ అండ్ జియాలజీ విభాగం అధికారి వెంకటసాయి, ఉప రవాణా కమిషనర్ కె సీతారామి రెడ్డి, భూగర్భ జలవనరుల శాఖ డీడీ వందనం, పంచాయతీ అధికారి బీఎస్ఎస్ సాయికుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ నజీమా బేగం తహశీల్దార్లు సిద్ధార్ధ, డి సీతారామయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ రిజర్వ్ కన్జర్వేటర్ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

అపరాల సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి: ఏవో

పొన్నూరుటౌన్, జనవరి22 (ఆంధ్రజ్యోతి): అపరాల పంటలైన మినుము, పెసర పంటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏవో డేగల వెంకటరామయ్య అన్నారు. మండల పరిధిలోని నిడుబ్రోలు పట్టణంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ పరిసర ప్రాంతాలలో సాగైన అపరాలు మొక్కజొన్న, జొన్న పంటలను అధికారులు పరిశీలించారు. మినుము, పెసర పంటలలో అధిక దిగుబడులు కోసం ఫార్ములేషన్ నెంబర్ నాలుగు పొటాషియం, నైట్రేట్ పోషకాలను వినియోగించాలన్నారు. మొక్కజొన్నలు, కాండం తొలుచు పురుగు నివారణకు ఫ్యూర్ఆన్ గుళికలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావును గెలిపించాలి

● యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ మల్లేశ్వరరావు

కొల్లిపర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో కేఎస్ లక్ష్మరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ టీఎస్ఎన్ మల్లేశ్వరరావు అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపరలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో లక్ష్మణరావు గెలుపు కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లేశ్వరరావు మాట్లాడుతూ లక్ష్మణరావు అందరికీ అందుబాటులో ఉండి నిజాయితీగా పనిచేసే వ్యక్తిఅన్నారు. సమావేశంలో విశ్రాంత ఎస్‌టీఐ ఏజీఎం కొల్లి నాగిరెడ్డి, విశ్రాంత ఎంఈవో ఎ.కుటుంబరెడ్డి, రైతు సంఘ నాయకులు ఎం.శివసాంబిరెడ్డి, కె.చంద్రశేఖర్, కేదార్నాధ్, తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌నని బెదిరించి అత్యాచారయత్నం

గుంటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): శివారు ప్రాంతాలు, నిర్జన ప్రదేశాల్లో ఏకాంతంగా ఉండే జంటలను లక్ష్యంగా చేసుకొని వారిని బెదిరించి వారిపై అత్యాచారానికి పాల్పడేందుకు ప్రయత్నించిన ఘటన పాతగుంటూరు పోలీస్‌స్టేసన్ పరిధిలో జరిగింది. నగరానికి చెందిన ఓ జంట జాతీయ రహదారిపై తక్కెళ్లపాడు, బుడంపాడు మధ్య రోడ్డు పక్కన ఉన్నారు. ఇది గమనించిన గోపి అనే యువకుడు వారి వద్దకు వెళ్లి తాను కానిస్టేబుల్‌నంటూ బెదిరించాడు. ఆ యువకుడిపై దాడిచేసి ఆమెపై అత్యాచారయత్నం చేశాడు. ఇంతలో సమీపంలో జనం ఉండడాన్ని గమనించిన బాధితులు ఒక్కసారిగా వారి వద్దకు పరిగెడుతూ వెళ్లారు. దీంతో నిందితుడు గోపి అక్కడి నుంచి పరారయ్యాడు. చేబ్రోలు మండలపరిధిలోని వేజెండ్ల గ్రామానికి చెందిన గోపి గతంలో కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇదే తరహాలో ఓ జంటను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. దీనిపై కేసు నమోదు చేసిన కొత్తపేట పోలీసులు గతంలో గోపీని అరెస్టు చేశారు. బెయిల్‌పై బయటకు వచ్చిన అనంతరం గోపి మరో నేరానికి ఒడగట్టాడు. బాధితుల ఫిర్యాదు మేరకు పాతగుంటూరు పోలీసులు గోపీని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

● పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగిరెడ్డి

తెనాలి రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): మండలంలో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ నాగిరెడ్డి చెప్పారు. బుధవారం మండలంలోని హాఫ్‌పేటలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఎంపీటీసీ సభ్యుడు ఇసుకపల్లి సుందరరావుతో కలిసి నాగిరెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. 61 పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించినట్లు పశువైద్యురాలు డాక్టర్ మీనాక్షి తెలిపారు. పలువురు పశుసంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● కొల్లిపర: గ్రామాల్లో ఏర్పాటుచేస్తున్న ఉచిత పశుఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి సాయిసతీష్‌రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర శివారు గుడిబండివారిపాలెంలో ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని రైతులతో కలిసి ఆయన ప్రారంభించారు.

● పొన్నూరు టౌన్: పశు సంపదను ప్రోత్సహించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుందని పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పి.ప్రేమ్‌చందు అన్నారు. మండల పరిధిలోని వల్లభరావుపాలెంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాన్ని డీడీ ప్రేమ్ చంద్ ప్రారంభించి పరిశీలించారు. అనంతరం మినీ గోకులం షెడ్లను పరిశీలించి రైతులకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ నాగార్జున, డాక్టర్ రవికిరణ్, డాక్టర్ షైనీ, జేబీవోలు కే శ్రీనివాసరావు, బీ శశికళ, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

తెనాలి అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. రూరల్ మండలం అంగలకుదురు వాసుదాస స్వామి పీఠంలో సీతారాముల కల్యాణం నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు పాల్గొన్నారు. కోలాటం, సంకీర్తనలు, గోపికల వేషధారణలలో విద్యార్థులు అలరించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● వేమూరి డీసీ ఉపాధ్యక్షుడు కొండలు


ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న రైతులు

కొల్లిపర, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని వేమూరి డీసీ ఉపాధ్యక్షుడు తోట ఏడుకొండలు అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర శివారు పిడపర్రు లాకు వద్ద నీటి సంఘాల కార్యవర్గ సభ్యులు, అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సమావేశానికి ఇరిగేషన్ ఏఈ రవిబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ రైతుల సహకారంతో పంట కాల్వల అభివృద్ధికి తనవంతు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఇరిగేషన్ డీఈ దీనదయాల్ మాట్లాడుతూ రైతులు పంట కాల్వల్లో చెత్తచెదారాన్ని వేయవద్దన్నారు. అనంతరం రైతులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో నీటి సంఘాల అధ్యక్షుడు బొట్టా శ్రీరాములురెడ్డి, బి.వెంకటరెడ్డి, కోటా వీరాంజనేయులు, నీటి సంఘాల ఉపాధ్యక్షుడు ఆరిమండ శివనాగమల్లేశ్వరరెడ్డి, కట్టా శ్రీహరిరెడ్డి, జొన్నల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుర్రిపాలెంలో మెగా వైద్యశిబిరం


బుర్రిపాలెంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తెనాలి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రిన్స్ మహేష్ బాబు సౌజన్యంతో ఆయన దత్తత గ్రామమైన బుర్రిపాలెంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించినట్లు ఆంధ్ర హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ రామారావు తెలిపారు. బుధవారం మహేష్‌బాబు సతీమణి నమ్రత శిరోద్కర్ జన్మదినంను పురస్కరించుకుని ఆంధ్ర హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ద్వారా మెడిసిన్, సర్జరీ, పిల్లల వైద్యులు, ఈఎన్‌టీ, గుండె జబ్బులు, ఎముకల వైద్య నిపుణులు పాల్గొని దాదాపుగా 162 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి 52 మంది బాలికలకు హ్యూమన్ పాపిల్లోమా వైరస్ వ్యాక్సిన్ (సర్వైకల్ క్యాన్సర్ రాకుండా) వేసినట్లు రామారావు పేర్కొన్నారు. అనంతరం ఆరోగ్య సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించినట్లు వివరించారు. ఇప్పటివరకూ మహేష్‌బాబు సౌజన్యంతో గ్రామంలో 43 క్యాంపులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్, డాక్టర్ సయ్యద్ ముదసిర్, డాక్టర్ కిషోర్, డాక్టర్ అమర్, డాక్టర్ రమేష్, నర్సులు, ఫార్మసిస్ట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్స్ గ్రామపెద్దలు, కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.


పింఛన్‌దారుల అర్హతలను పరీక్షిస్తున్న వైద్యులు

పింఛనుదారుల అర్హతలపై తనిఖీ

తెనాలి రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో సదరం సర్టిఫికెట్ల ద్వారా పింఛన్ పొందుతున్న లబ్ధిదారుల అర్హతలపై తనిఖీ బుధవారం ప్రారంభమైంది. దృష్టిలోపం, వినికిడి, మాట్లాడలేని సమస్యలతో పింఛన్ పొందుతున్న వారిని సర్టిఫికెట్ ఆధారంగా 100 మందికి పరీక్షలు నిర్వహించి వివరాలను నమోదు చేశారు. గురు, శుక్రవారాల్లో కూడా శిబిరం కొనసాగుతుందని వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి తెలిపారు. మునిసిపల్, సచివాలయ హెల్త్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సర్వట్రస్టు సేవలు అభినందనీయం

● జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి

తెనాలి, మారీసుపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజల కోసం సర్వట్రస్ట్ సభ్యులు చేస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి అన్నారు. స్థానిక చెంచుపేటలోని జిల్లా వైద్యశాలలో బుధవారం సర్వట్రస్టు డైరెక్టర్ లీలా లావణ్య ఆధ్వర్యంలో హెచ్ఐవీ బాధితులు 50మందికి నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి పాల్గొని హెచ్ఐవీ బాధితులకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ బాధితులకు ట్రస్ట్ సభ్యులు చేస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ పి.అంకినీడు ప్రసాద్, వైద్యులు రమ్యకృష్ణ, స్నేహశ్రీ, ఏఆర్‌టీ సిబ్బంది, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పాదయాత్ర



పాదయాత్రగా వస్తున్న కాంగ్రెస్ నాయకులు

తెనాలి అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రదేశ్ కాంగ్రెస్ పిలుపు మేరకు కాంగ్రెస్ నాయకులు బుధవారం పాదయాత్ర చేశారు. పార్లమెంట్‌లో హోంమంత్రి అమిత్ షా అంబేద్కర్ చేసిన వ్యాఖ్యలపై నిరసన తెలిపారు. కాంగ్రెస్ కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు ర్యాలీచేసి అక్కడ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఇన్‌చార్జి శ్రీపతి ప్రకాష్ మాట్లాడుతూ, బీజేపీ పాలనలో మతతత్వం పెరిగిపోయిందన్నారు. రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్‌పై విమర్శలు చేయడం సరికాదన్నారు. కేంద్రమంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్‌కుమార్, డాక్టర్ చందు సాంబశివుడు, పొన్నూరు శశి, కర్లపూడి బుల్లియ్య, శివకుమార్, స్టీవెన్‌పాల్, సత్యనారాయణ, సుబ్బారావు పాల్గొన్నారు.


క్రీడాకారుడిని అభినందిస్తున్న సీఈవో ఉమామహేశ్వరరావు

హ్యాండ్‌బాల్ పోటీల్లో ఎన్నారై కళాశాల విద్యార్థి ప్రతిభ

తెనాలి అర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్‌లో జరిగిన జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో తెనాలి ఎన్నారై కళాశాల విద్యార్థి అద్దంకి రాజ్‌పాల్ ప్రతిభ చూపాడు. జాతీయ స్థాయిలో జట్టు రెండోస్థానం సాధించేందుకు కృషి చేశాడు. బుధవారం కళాశాలలో ప్రతిభచూపిన రాజ్‌పాల్‌ను సీఈవో ఉమామహేశ్వరరావు సత్కరించారు. ప్రిన్సిపాల్ శివన్నారాయణ, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.